# ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5



## అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 10 జూన్ 2025




జగన్ మీడియాను

జగన్ పత్రిక ప్రధాన కార్యాలయం ఎదుట కూటమి నాయకుల ధర్నా

# మూసేయాలి



కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నం.. అడ్డుకున్న పోలీసులు

అనంతపురం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్న జగన్ పత్రిక, చానల్‌ను వెంటనే మూసివేయాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. జగన్ చానల్ డిబెట్‌లో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై కూటమి నేతల నిరసనలు మిన్నంటాయి. కక్కలపల్లి క్రాస్‌లోని జగన్ పత్రిక ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. కార్యాల యం ఎదుట బైఠాయించి, పత్రికకు, యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యాలయంలో వెళ్లేందుకు యత్నించారు. అయితే వారి ప్రయత్నాన్ని పెద్దఎత్తున మోహరించిన పోలీసుల అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈసందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ దేశంలో మహిళల్ని అవమానపరిచేలా, కించపరిచేలా వ్యవహరించిన పార్టీ ఏదైనా ఉందంటే అది వైసీపీ మాత్రమేనన్నారు. జగన్‌కు సంబంధించిన చానల్ చర్చలో విశ్లేషకుడంటూ కృష్ణంరాజు అనే సంస్కార హీనుడు అమరావతి మహిళల గురించి దారుణంగా మాట్లాడితే సీనియర్ జర్నలిస్టు అని చెప్పుకునే కొమ్మినేని శ్రీనివాసరావు నవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎంతో గొప్ప మనసుతో అమరావతి ప్రాంత మహిళలు తమ భూముల్ని త్యాగం చేస్తే వారిని వైసీపీ నాయకులు మొదటి నుంచి అవమానించే లా మాట్లాడుతున్నారన్నారు. వైసీపీ నాయకుల తీరుతో అమరావతి మహిళలు చాలా సార్లు అవమానపడ్డారన్నారు. ఇక ఇలాంటి వారిని ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొమ్మినేనిని అరెస్టు చేశారని, కృష్ణంరాజును అరెస్టు చేసి తీహార్ జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. జగన్‌రెడ్డి, భారతీరెడ్డి అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు లక్ష్మీనరసింహులు, స్వప్న, తేజశ్విని, సైఫుద్దీన్, అశోక్‌రెడ్డి, ఇమామ్ హుస్సేన్, గుత్తా ధనుంజయనాయుడు, మూర్తి, కడియాల కొండన్న, బాలాంజనేయులు, దుర్గేష్, బొమ్మినేని శివ, మోహన్‌కుమార్, వన్నూరప్ప, గోపాల్ గౌడ్, సుధాకర్‌నాయుడు, నాయుడమ్మ, కంటాదేవి, అయేషా, శైలజ పాల్గొన్నారు.




ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న కూటమి నేతలు, పత్రిక కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నం.. అడ్డుకుంటున్న పోలీసులు




టీడీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

# పెళ్లి అన్నందుకే..!

## తన్మయి హత్యకు కారణం ఇదే.. చంపింది నరేష్?

- ఇదివరకే కులాంతర వివాహం
- అయినా తన్మయితో సాన్నిహిత్యం
- నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి రాయితో దాడి
- అరవడంతో బీరు బాటిల్ నోట్లో పెట్టి హత్య



నరేష్ (ఫైల్)



తన్మయి(ఫైల్)

అనంతపురం క్రైం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని తన్మయి(19) హత్య కేసు మిస్టరీ వీడింది. ఆమెను నరేష్ హత్య చేసినట్లు తేలింది. అయితే, పోలీసులు అధికారికంగా హత్య, హంతకుడి విషయాన్ని ఇంకా నిర్ధారించలేదు. అప్పటికే వివాహమైన నరేష్‌ను పెళ్లి చేసుకోవాలని తన్మయి ఒత్తిడి చేయడంతో అతను ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలిసింది. అనంతపురం శివారులోని రామకృష్ణ కాలనీకి చెందిన ఎరుకుల తన్మయి ఈ నెల 7వ తేదీ శవమై తేలిన విషయం తెలిసిందే. ఈ నెల 3వతేదీ ఇంటి నుంచి అదృశ్యమైన ఆమె.. అదే రోజు రాత్రి లేదా మరుసటి రోజు హత్యకు గురైనట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ హత్య తానే చేసినట్లు పోలీసుల విచారణలో నరేష్ ఒప్పుకున్నాడని, మరికొన్ని విషయాలు చెప్పాడని తెలిసింది. హత్యోదంతంలో ఒక్కడే పాల్గొన్నాడా, ఇంకా ఎవరైనా ఉన్నారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**చివరి ఫోన్‌కాల్ అతనిదే..**

అనంతపురం నగరంలోని ఆరో రోడ్డుకు చెందిన నరేష్ టైల్స్ పని చేస్తుంటాడు. కొంతకాలం క్రితం రామక్రిష్ణ కాలనీలోని ఓ కొత్త ఇంటికి టైల్స్ వేసేందుకు వెళ్లాడు. ఆ ఇల్లు తన్మయి ఇంటి సమీపంలో ఉంది. అలా నరేష్‌కు, తన్మయికి పరిచయం ఏర్పడింది. తన తండ్రి సెల్ నుంచి నరేష్‌కు ఫోన్ చేసేదని సమాచారం. అప్పుడప్పుడు నరేష్‌తో ఫోన్‌పేలో, నగదు రూపంలో డబ్బు తీసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 3వతేదీ రాత్రి తనకు కడుపునొప్పిగా ఉందని, కూల్‌డ్రింక్స్ తీసుకుంటానని చెప్పి తన్మయి బయటకు వెళ్లింది. అటు నుంచి అటే బైక్‌లో నరేష్‌తో కలిసి వెళ్లినట్లు సమాచారం. చివరి ఫోన్‌కాల్ నరేష్‌కు చేసినట్లు తెలుస్తోంది.

**పెళ్లి సంబంధాల నేపథ్యంలో ఒత్తిడి..**

నరేష్ ఏడాదిన్నర క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత తన్మయితో

(మిగతా 6లో)

**మరో ఇద్దరికి కొవిడ్** 6లో

# అమ్మా.. నీకోసం..

## ఎంత వెతికానో తెలుసా..?



రామసుబ్బమ్మ



కుమారుడితో రామసుబ్బమ్మ

**తొమ్మిది** పదులకు పైగా వయసున్న ఈ అమ్మ పేరు రామసుబ్బమ్మ. దారి తప్పి.. గుత్తి పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో వచ్చింది. కర్ర సాయంతో అడుగులో అడుగు వేస్తూ.. తన ఇంటిని వెతుక్కుంటోంది. ఆమె పరిస్థితిని గమనించిన స్థానికులు 'ఎవరు..? ఏమిటి..?' అని ఆరా తీశారు. పుట్లూరు.. తిమ్మంపల్లి.. అరకటివేముల అని ఊరి పేర్లు మాత్రమే చెప్పగలిగింది. తన కొడుకు పేరు శేఖర్ అని చెప్పింది. గట్టిగా కేకలు వేస్తేగానీ ఆమెకు ఏదీ వినబడదు. కళ్లు పెద్దగా కనిపించవు. ఇలాంటి పరిస్థితిలో ఆమెను అయినవారికి ఎలా అప్పగించాలో తెలియలేదు. ఓ యువకుడు టెక్నాలజీ వాడాడు. మీడియా గ్రూపులో ఆమె చెబుతున్న వివరాలు.. ఫొటోను అప్‌లోడ్ చేశాడు. గుత్తి ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర స్పందించి.. పుట్లూరు ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ ధనుంజయకు ఆమె ఫొటో.. వివరాలను పంపించారు. ఆయన 'అమ్మ'ను గుర్తు పట్టాడు. ఆమెది అరకటివేముల అని, ఆమె కొడుకు తనకు తెలుసని చెప్పాడు. ఆ ఊరివారిని అడిగి.. అతని సెల్ నంబర్ తీసుకుని ఫోన్ చేశాడు. అప్పటికే అమ్మకోసం ఊరంతా గాలిస్తున్న కొడుక్కు ప్రాణం లేచొచ్చింది. వెంటనే చెర్లోపల్లికి చేరుకుని.. అమ్మను చూసి కంటతడి పెట్టాడు. 'నీకోసం ఎంతసేపటి నుంచి వెతుకుతున్నానో తెలుసా..? బయటకు ఎందుకొచ్చావ్..?' అని బోరున ఏడ్చాడు. తన తల్లిని అప్పగించిన స్థానికులు, పోలీసులకు రెండు చేతులు జోడించి.. కృతజ్ఞతలు తెలిపాడు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు సంతానానికి భారమౌతున్న ఈ రోజుల్లో.. పండు ముసలిదైన తల్లికోసం అతను పడుతున్న తపన చూసి స్థానికుల కళ్లు చెమ్మగిల్లాయి. ఇంతకూ ఈ అమ్మ ఎలా తప్పిపోయిందో తెలుసా..? పుట్లూరు మండలం అరకటివేములకు చెందిన చంద్రశేఖర్ గుత్తి మండలం అనగానిదొడ్డిలో పొలాన్ని కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్నాడు. గుత్తి బీసీ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం సొంతూరుకు వెళ్లి తల్లిని పిలుచుకువచ్చాడు. ఆమెకు ఉదయం భోజనం పెట్టి, మధ్యాహ్న భోజనానికి ఏర్పాట్లు చేసి.. తన భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లిపోయాడు చంద్రశేఖర్.! ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఏమీ తోచలేదో ఏమో..! రామసుబ్బమ్మ బయటకు వచ్చేసింది. సుమారు రెండు కి.మీ. దూరంలోని చెర్లోపల్లి కాలనీకి చేరుకుంది. ఇదివరకూ ఎప్పుడూ చూడని ఆమెను స్థానికులు పలకరించి.. తప్పిపోయినట్లు గుర్తించారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రయత్నించి.. రాత్రి సుమారు 11 గంటల సమయంలో కుమారుడికి అప్పగించారు. నెరిసిన జుట్టుతో వృద్ధుడిలా కనిపించే కొడుకు.. పండు ముసలితనంలో ఉన్న అమ్మకోసం చిన్నపిల్లాడిలా తపించడం అందరినీ ఆలోచింపజేసింది.

- ఆంధ్రజ్యోతి, గుత్తి

# స్ఫూర్తి నింపడానికే షైనింగ్ స్టార్స్

- జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్
- ఎమ్మెల్యేలై చట్టసభల్లో అడుగుపెట్టాలి
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
- 219 మంది షైనింగ్ స్టార్స్‌కు సన్మానం
- రూ.20 వేల చెక్కు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేత



విద్యార్థులతో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం విద్య, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ షైనింగ్ స్టార్స్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సన్మానించేందుకు సోమవారం నగరంలోని మూడో రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో షైనింగ్ స్టార్స్ పేరులో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆర్డీవో కేశవనాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో కష్టాలను దాటి మంచి మార్కులు పొందిన విద్యార్థులు అభినందనీయులన్నారు. విద్యార్థుల సక్సెస్ ప్రయాణంలో నిలిచిన ప్రభుత్వ టీచర్లు, పేరెంట్స్‌ను అభినందించాల్సిందేనన్నారు. విద్యార్థుల్లో ఒరిజినాలిటీ, క్రియేటివిటీ పెరగాలని అభిలషించారు. వచ్చే విద్యా ఏడాది నుంచీ కూడా గ్రూప్స్, ఐఏఎస్‌కు శిక్షణ ఇచ్చే అంశాన్ని ఆలోచిస్తామని తెలిపారు. మీరంతా షైనింగ్ స్టార్స్ మాత్రమే కాదని, ఇతర విద్యార్థులకు గైడింగ్ స్టార్స్ కూడా అని కొనియాడారు. సెల్‌ఫోన్లు చూడ్డం తప్పుకాదని, వాటిని సరైన డైరెక్షన్‌లో వాడాలని సూచించారు. రీల్స్ చూడ్డం కాకుండా, మీ జీవిత లక్ష్యాలు చేరుకోవడానికి ఉపయోగపడే డాక్యుమెంటరీలు చూడాలని హితవు పలికారు. అంతకుముందు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. పిల్లలు ఎంతో మంది తల్లి లేదా తండ్రి లేకున్నా, చాలా కష్టపడి చదివారని, వాళ్ల మాటలు వింటుంటే కళ్లలో నీళ్లు తిరిగాయన్నారు. ప్రతి విద్యార్థి మంచిగా చదవాలని మీకు టీచర్లతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధుల సపోర్ట్ ఎప్పటికీ ఉంటుందన్నారు. ముఖ్యంగా బాలికలకు ఏ ఇబ్బంది ఎదురైనా ముందుగా తల్లిదండ్రులకు చెప్పాలని, తర్వాత టీచర్లకైనా తెలియజేయాలన్నారు. బాగా చదువుకుని, సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకుని, వాటి పరిష్కారానికి భవిష్యత్తులో రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలుగా గెలిచి చట్టసభల్లో అడుగు పెట్టాలని ఆకాంక్షించారు. అంతకుముందు డీఈఓ ప్రసాద్ బాబు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, ఏపీసీ శైలజ మాట్లాడారు. తర్వాత 184 మంది పదో తరగతి విద్యార్థులకు, 35 మంది ఇంటర్ విద్యార్థులకు రూ.20 వేల చెక్కులు, మెడల్స్, సర్టిఫికెట్లను కలెక్టర్, రాప్తాడు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. తర్వాత కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖల డీడీలు, డీవైఈఓ శ్రీనివాసులు, ఎంఈఓ వెంకటస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిటాల సునీత




మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాలికపై అత్యాచారం కేసులో

## ఆరుగురి అరెస్టు

రామగిరి మండలంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసు లో ఆరుగురిని అరెస్టు చేశామని ఎస్పీ రత్న తెలిపారు. మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. నిందితులు గతంలోనూ అత్యాచారాలు చేసి, బాలికల గర్భం తీయించారని అన్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా బెదిరించారని, ఆ నేర చరిత్రనూ తోడుతున్నామని అన్నారు.

(వివరాలు మెయిన్‌లో)

**నేడు విచారణకు పైలెట్ అనిల్** 6లో

# దర్జాగా ఇసుక తరలింపు

- పెన్నానది, వంక ప్రాంతాల్లో తవ్వకాలు
- పగలు నిల్వ.. రాత్రి తరలింపు
- పట్టించుకోని అధికారులు



నిదనవాడ వద్ద పెన్నానదిలో నిల్వ ఉంచిన ఇసుక

శింగనమల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను అక్రమార్కులు యథేచ్ఛగా దోచేస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. దర్జాగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. వైసీపీ పాలనలో అప్పటి అధికారుల అండతో విచ్చలవిడిగా పెన్నానది, ఇతర వంకల్లో ఉన్న ఇసుకను తరలించారు. ఇప్పుడూ అదే రీతిలోనే శింగనమల, గార్లదిన్నె, నార్పల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల్లో ఇసుక దందా కొనసాగుతోంది. శింగనమల మండలంలో పెన్నానది 12 కిలో మీటర్లు ప్రవహిస్తుంది. కల్లుమడి తరిమెల, నిదనవాడ, రాచేపల్లి ఉల్లికల్లు నుంచి కొంతకాలంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ ప్రాంత ఇసుకకు డిమాండ్ ఉండడంతో అనంతపురం తరలిస్తూ పెన్నానదిని కొల్లగొడుతున్నారు. సలకంచెరువు, జూలాకాలువ, కొరివిపల్లి, పెరవలి, పోతురాజుకాల్వ ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.

**పగలు నిల్వ.. రాత్రి తరలింపు..**

శింగనమల మండలంలోని పెన్నానదితోపాటు వంక ప్రాంతాల్లో పగలు ఇసుకను ఎక్స్‌కవేటర్‌తో సేకరించి ట్రాక్టర్ల ద్వారా ఒక చోట నిల్వలు ఉంచుతారు. రాత్రి సమయంలో సమీపంలోని

(మిగతా 6లో...)

# వెలుగులోకి అక్రమాలు

- అనుమతి ఒకలా, నిర్మాణం మరోలా
- వైసీపీ కార్పొరేటర్ కుమారుడి నిర్వాకం
- జీప్లస్1కి అనుమతి.. అదనంగా మూడంతస్తులు
- రూ.కోటి విలువైన స్థలం కబ్జాలో వైసీపీ నాయకుడి హస్తం

అనంతపురం క్రైం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నామనే ధీమాతో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. నగరంలో అక్రమ కట్టడాల బాగోతంలో వైసీపీ నాయ కుల పాత్ర అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. చాలా భవనాల విషయంలో సిఫార్సుల పేరుతో చర్యలు తీసుకోకుండా ముడుపులు పుచ్చుకున్నారు. ఇప్పుడు వైసీపీ నాయకులే అక్రమ కట్టడాల్లో భాగస్వాములయ్యారు. అధికారులు మాత్రం నోటీసులతో సరిపెడుతున్నారు.

**కార్పొరేటర్ కుమారుడి నిర్వాకం**

అనుమతులు లేకపోయినా ఓ కార్పొరేటర్ కుమారుడు భవనం నిర్మించాడు. ప్రస్తుతం ఈ భవన నిర్మాణం వివాదస్పదమైంది. నగరంలోని 39వ డివిజన్ కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ కుమారుడు చింతకుంట మధు మూడేళ్ల కిందట నగరంలోని లక్ష్మీనగర్‌లో ఓ భవన నిర్మాణానికి అప్రూవల్ తీసుకున్నాడు. తన స్థలాన్ని రెండు భాగాలుగా చేసుకున్నాడు. ఓ భాగంలో జీప్లస్1గా నిర్మించారు. ఏడాది తర్వాత రెండో భాగంలో జీప్లస్1కు అదనంగా పైన రెండంతస్తులు నిర్మించాడు. నాలుగో అంతస్తుగా పెంట్ హౌస్ కూడా నిర్మించాడు. అయినా అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారులు నోరు మెదప లేదు. ప్రస్తుతం

(మిగతా 6లో)



లక్ష్మీనగర్‌లో కార్పొరేటర్ కుమారుడు రెండు భాగాల్లో నిర్మించిన భవనాలివే

# దర్జాగా ఇసుక తరలింపు



పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్న వాహనాలు

(5వ పేజీ తరువాయి...)

అనంతపురం, తాడిపత్రి, నార్పల ప్రాంతాలకు తరలిస్తారు. ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. అధికారులకు నెల వారి మామూళ్లు చేరుతున్నట్లు తెలుస్తోంది. దీంతో దర్జాగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వాహనాలతో ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.2 వేల నుంచి రూ.5వేల వరకు, టిప్పర్ రూ.8వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. ప్రజలు నుంచి ఫిర్యాదు అందితే పోలీసులు హడావిడి చేయడం.. నాయకుల సిఫార్సుతో వదిలేయడం సాధారణమైపోయింది. అదీ లేకపోతే నామమాత్రపు అపరాధ రుసుం వేసి వదిలేస్తున్నారు. మిగిలిన శాఖలు అసలు పట్టించుకోలేదు. మూడు రోజుల క్రితం శింగనమల మండలం నిదనవాడ గ్రామస్థులు ఇసుక తరలింపును అడ్డుకొని వాహనాలను పోలీసులకు అప్పగించారు. భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతాయని, భూగర్భజలాలు తగ్గిపోతాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు తెలిపారు.

**అక్రమ తరలింపును అడ్డుకుంటాం**

పెన్నానది, వంక ప్రాంతాల నుంచి ఇసుకను తరలించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి అడ్డుకట్ట వేస్తాం. ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సూచించాం. వారితో పాటు పోలీసు సిబ్బందితో కలసి తనిఖీలు చేస్తాం. అక్రమంగా తరలించే వాహనాలను జప్తు చేసి సంబంధింత యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

**-ఓబులరెడ్డి, ఏడీ, భూగర్భ గనులశాఖ, తాడిపత్రి**

# వెలుగులోకి అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారి శిరీష అప్పటి నుంచీ పనిచేస్తున్నారు. కానీ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు.

**ఆ స్థలం ఇంకా అలానే...**

మారుతీ నగర్ శివారులో రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొంత నగర పాలిక స్థలం ఆక్రమించాడు. తన పార్టీకి సంబంధించి కార్యాలయానికి ప్రత్యేకంగా ఓ గదిని నిర్మించాడు. చుట్టూ ప్రహరీలాగా కంచె వేశారు. కొన్ని సెంట్లు కార్పొరేషన్ స్థలం ఆక్రమించారు. దాదాపు నాలుగేళ్ల కిందట ఈ వ్యవహారం జరిగినా అధికారులు ఆ స్థలం విషయంలో చర్యలు తీసుకోలేకపోయారు.

**అశోక్‌నగర్‌లో కార్పొరేటర్ కుమారుడు..**

నగరంలోని అశోక్‌నగర్‌లో నగరపాలిక స్థలం ఆక్రమణకు గురైంది. ఇందులో ఓ వైసీపీ కార్పొరేటర్ కుమారుడు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. సర్వేనెంబరు 2132, 2133ల పరిధిలోని ఐదు సెంట్ల నగర పాలిక స్థలం ఆక్రమించినట్లు తెలిసింది. దాదాపు రూ.కోటికి పైగా ఆ స్థలం విలువ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక ఆ కార్పొరేటర్ కుమారుడికి కొందరు టీడీపీ నాయకులు అండగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ స్థలానికి ఫెన్సింగ్ వేసే పనిలో ఉన్నారట. ఇక టౌన్ ప్లానింగ్ అధికారులు తమకు భవనాల నుంచి వచ్చే ముడుపులు చాలు కార్పొరేషన్ స్థలాలు ఎవరు ఆక్రమిస్తే ఏంటనే పరిస్థితిలో ఉన్నారు.

**చర్యలు తీసుకోండి: టీఎన్‌టీయూసీ**

అనంతపురం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 39వ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మోహన్‌కుమార్ కమిషనర్ బాల స్వామిని కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ బాలస్వామికి సోమవారం ఆయన ఫిర్యాదు చేశారు. 39వ డివిజన్ కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ కుమారుడు చింతకుంట మధు అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. భవన నిర్మాణం కోసం ఒక అనుమతి తీసుకొని, నగర పాలక సంస్థ అధికారులకు తెలియకుండా మరో గృహ నిర్మాణం చేపట్టారన్నారు. దీనిపై క్షేత్ర స్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## బాధ్యతలు స్వీకరించిన వెంకటశివుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక సంక్షేమ మండలి వైస్ చైర్మన్‌గా టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని కార్మిక సంక్షేమ మండలి కార్యాలయంలో తన కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, అభిమానుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు. కార్మిక సంక్షేమ మండలి వైస్ చైర్మన్‌గా సక్రమంగా విధులు నిర్వర్తించి, రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం, అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు.

## నేటి నుంచి మంత్రి పర్యటన

ధర్మవరంరూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళ, బుధవారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు మంత్రి కార్యాలయ సిబ్బంది సోమవారం ప్రకటన ద్వారా తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు తాడిమర్రిలో నూతన తహసీల్దార్ కార్యాలయం, పబ్లిక్‌హెల్త్ యూనిట్ బ్లాక్‌ను ప్రారంభిస్తారనీ, మధ్యాహ్నం 12.30 గంటలకు అనంతపురంలో ఏబీవీపీ అభయసవర్గం సమావేశంలో పాల్గొంటారన్నారు. జూన్11న ఉదయం 6.30 గంటలకు ధర్మవరంలోని కాలేజీ గ్రౌండ్‌లో యోగా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 11.30 గంటలకు గొట్లూరు గ్రామంలో వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, ఆ తరువాత ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ప్రకటనలో వెల్లడించారు.

# సమస్యలను పరిష్కరించాలి

**ఆర్టీసీ కార్మిక పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి**



పీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ కార్మిక పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం పీఓ చెంద్రాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించడం శుభపరిణామమన్నారు. సర్క్యులర్‌ను అన్ని డిపోలలో అమలు చేసి, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలన్నారు. నాలుగేళ్లుగా ప్రమోషన్లు ఆగిపోయాయని, వెంటనే కల్పించాలన్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. జీఓ 114లో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సులను రూ.150ల నుంచి రూ.400లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాధాకృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఈడీ ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి పరమేశ్వర్, కోశాధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి వన్డే క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం నుంచి ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. ఈ టోర్నీలో అనంతపురం, చిత్తూరు, కడప, నెల్లూరు, కర్నూలు జట్లు పాల్గొంటాయన్నారు. తొలిరోజు అనంతపురం-కడప, చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరుగుతాయన్నారు.

**జిల్లా జట్టు ఇదీ..**

వినయ్‌కుమార్ (కెప్టెన్), గిరినాథ్‌రెడ్డి, ఎంకె దత్తారెడ్డి, అర్జున్ టెండూల్కర్, మహేంద్రరెడ్డి, రాజు కుళ్ళాయప్ప, మల్లికార్జున, మహ్మద్‌కమిల్, దీపక్, సంతోష్, ప్రదీప్‌రెడ్డి, ప్రమోద్, రోహిత్‌రోషన్, వికాస్, జైకృష్ణ. స్టాండ్‌బైలుగా వీరారెడ్డి, చైత్రవర్ధన్, ప్రశాంత్, భానుప్రకాష్, లోహిత్‌సాయి కిశోర్, లీలసాయి.



జట్టు కెప్టెన్ వినయ్‌కుమార్

## సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ 2024 సంవత్సరానికిగాను టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఇందుకు 2022, 2023, 2024 సంవత్సరాలలో భూమి, నీరు (సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహసాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన సాహసికులు అర్హులన్నారు. సాహస క్రీడల్లో తమను తాము అంకితం చేసుకుని, నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును ప్రతి ఏటా రాష్ట్రపతి బహుకరిస్తారన్నారు. అవార్డు గ్రహీతకు టెన్సింగ్ నార్కే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం, రూ.15లక్షలు నగదు అందజేస్తారన్నారు. ఆసక్తి, అర్హతగల సాహస క్రీడాకారులు ఈనెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9959517370 నంబరులో సంప్రదించాలన్నారు. వెబ్‌సైట్ http:///awards.gov.in/ ను సంప్రదించాలన్నారు.

# పెళ్లి అన్నందుకే..

(5వ పేజీ తరువాయి)

పరిచయమైంది. ఇద్దరూ సన్నిహితంగా మెలిగారు. తన్మయికి పెళ్లి సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. దీంతో తనను పెళ్లి చేసుకోవాలని నరేష్‌పై ఒత్తిడి తెచ్చింది. నరేష్ తన భార్య నుంచి ఇబ్బంది ఎదురవుతుందని భావించాడు. ఈ నేపథ్యంలో పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.

**రాయితో కొట్టి.. బీరు బాటిల్ నోట్లో పెట్టి...**

విశ్వసనీయ సమాచారం మేరకు, నరేష్ ఈనెల 3వతేదీ రాత్రి తన్మయిని బైక్‌లో ఎక్కించుకుని వెళ్లాడు. ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకుని కొంతసేపు ఉన్నారు. ఆ సమయంలోనూ తన్మయి పెళ్లి గురించి ఒత్తిడి తెచ్చింది. ఆ తరువాత అనంతపురం నుంచి దూరంగా తీసుకెళ్లాడు. కూడేరు మండలం గొట్కూరు సమీపంలో, అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కనున్న పొదల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ పెళ్లి గురించి మరోసారి చర్చకు వచ్చింది. తనకు ఇప్పటికే పెళ్లయిందని, పెళ్లి చేసుకోవడం కుదరదని నరేష్ స్పష్టం చేశాడు. అయినా బలవంతం చేయడంతో 'నీకు ఇప్పటికే పలువురితో సంబంధాలున్నాయి. నేనెలా చేసుకుంటాను?' అని ప్రశ్నించాడు. గొడవ ముదిరి.. అక్కడున్న రాయితో తన్మయి తలపై కొట్టాడు. కింద పడి అరుస్తుండటంతో మరోసారి రాయితో బాదాడు. అప్పటికీ తన్మయి బాధతో అరుస్తుంటే సమీపంలోని బీరు బాటిల్‌ను నోట్లో పెట్టి తలపై రాయితో మరోసారి కొట్టాడు. దీంతో కొంతసేపటికే తన్మయి ప్రాణాలు విడిచింది. తన్మయి అదృశ్యమైన 3వ తేదీనే ఈ ఘటన జరిగిందా, లేక 4వ తేదీ రాత్రి జరిగిందా అనేది తెలియాల్సి ఉంది. ఆమె చనిపోయాక పెట్రోల్‌పోసి నిప్పంటించాడా...? లేక ఎక్కువ రోజులు కావడంతో శరీరం కుళ్లిపోయి అలా తయారైందా అన్నదీ స్పష్టత ఇవ్వడం లేదు.

**పట్టుకున్నా.. కట్టు కథలు**

ఈనెల 3వతేదీన తన్మయి అదృశ్యమైంది. 4వ తేదీన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరేష్‌పై అనుమానం ఉందని చెప్పారు. దీంతో విచారణ నిమిత్తం నరేష్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. తానేమీ చేయలేదని నరేష్ కట్టుకథలు అల్లాడు. ఈ స్థాయిలో పోలీసులు కొంత నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. గుర్తుతెలియని మృతదేహం కనిపించేదాకా మిస్సింగ్ కేసులో పెద్దగా పురోగతి లేదు. ఆ తరువాత నరేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో నిజం ఒప్పేసుకున్నాడు.

# ఆర్‌అండ్‌బీలో బదిలీలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ఆర్ అండ్‌బీలో పలువురు సిబ్బందిని బదిలీ చేస్తూ బదిలీల కమిటీ సభ్యులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా 11 మంది సీనియర్ అసిస్టెంట్లు, మరో ఇద్దరు టెక్నికల్ ఆఫీసర్లు, మరో ముగ్గురు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లను, ముగ్గురు సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గత నెల 29న ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో బదిలీల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారితోపాటు ఆబ్లిగేషన్స్‌తో వినతులు పెట్టుకున్నవారికి సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అందుకు అనుగుణంగా సోమవారం జాబితాను ప్రకటించారు.

**పంచాయతీరాజ్ లో ఇద్దరు ఈఈలు...**

జిల్లాలోని పంచాయితీరాజ్ విభాగంలో ఇద్దరు ఈఈలను బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఐయూ పెనుకొండ ఈఈగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని చిత్తూరు పీఆర్ఐ ఈఈగా బదిలీ చేశారు. ఏపీ సమగ్ర శిక్ష ఈఈగా డెప్యుటేషన్‌పై ఉన్న శంకరయ్యకు డెప్యుటేషన్ రద్దు చేసి పెనుకొండ పీఐయూ ఈఈగా బదిలీ చేశారు.

**సీనియర్ అసిస్టెంట్లు**

| ఉద్యోగి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| రాజేష్‌కుమార్ | కర్నూలు డివిజన్ కార్యాలయం | ధర్మవరం ఈఈ కార్యాలయం |
| గోపాల్ | అనంతపురం ఎన్‌హెచ్ డివిజన్ | నంద్యాల ఈఈ కార్యాలయం |
| మురళీకృష్ణ | ధర్మవరం డివిజన్ కార్యాలయం | అనంతపురం ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయం |
| శ్రీధర్‌స్వామి | గుత్తి సబ్‌డివిజన్ | అనంతపురం ఎన్‌హెచ్ సబ్‌డివిజన్ డీఈఈ కార్యాలయం |
| బాలవర్ధిరాజు | అనంతపురం డివిజన్ | కర్నూల్ సబ్‌డివిజన్ డీఈఈ కార్యాలయం కార్యాలయం |
| లక్ష్మీదేవి | మడకశిర సబ్‌డివిజన్ | అనంతపురం ఎస్‌ఈ సర్కిల్ కార్యాలయం |
| రామచంద్ర | అనంతపురం ఎన్‌హెచ్ | గుత్తి సబ్‌డివిజన్ డివిజన్ కార్యాలయం |
| వెంకటచంద్రశేఖర్ | అనంతపురం డివిజన్ | నంద్యాల ఈఈ కార్యాలయం |
| గోవిందప్ప | నంద్యాల డివిజన్ కార్యాలయం | అనంతపురం ఈఈడివిజన్ కార్యాలయం |
| ఎస్‌ఆర్‌జీ ప్రసాద్ | కర్నూలు సబ్‌డివిజన్ కార్యాలయం | అనంతపురం ఈఈ సబ్‌డివిజన్ కార్యాలయం |
| చంద్రశేఖర్ | అనంతపురం సర్కిల్ కార్యాలయం | అనంతపురం ఈఈ సబ్‌డివిజన్ కార్యాలయం |
| | **టెక్నికల్ ఆఫీసర్లు** | |
| కృష్ణారెడ్డి | కళ్యాణదుర్గం డివిజన్ కార్యాలయం | అనంతపురం ఎన్‌హెచ్ డివిజన్ కార్యాలయం |
| పెంచలస్వామి | అనంతపురం ఎన్‌హెచ్ డివిజన్ | ఆదోని ఎన్‌హెచ్ డివిజన్ కార్యాలయం |
| | **అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు** | |
| ఖాదర్‌బాషా | అనంతపురం ఎన్‌హెచ్ సర్కిల్ కార్యాలయం | కళ్యాణదుర్గం ఎన్‌హెచ్ డివిజన్ కార్యాలయం |
| గోవిందప్ప | కళ్యాణదుర్గం డివిజన్ కార్యాలయం | నంద్యాల ఈఈ డివిజన్ కార్యాలయం |
| ఓబులపతి | కర్నూల్ డివిజన్ కార్యాలయం | అనంతపురం ఎన్‌హెచ్ సర్కిల్ కార్యాలయం |
| | **సూపరింటెండెంట్లు** | |
| శ్రీనివాస రంగన్ | నంద్యాల డివిజన్ కార్యాలయం | కళ్యాణదుర్గం ఈఈ డివిజన్ కార్యాలయం |
| కృష్ణకుమారి | కళ్యాణదుర్గం డివిజన్ కార్యాలయం | అనంతపురం ఎన్‌హెచ్ ఎస్‌ఈ సర్కిల్ కార్యాలయం |
| వీరభద్రయ్య | అనంతపురం ఎన్‌హెచ్ | ఆదోని ఈఈ డివిజన్ సర్కిల్ కార్యాలయం |

**ఖజానా శాఖలో 41మంది..**

అనంతపురం టౌన్, జూన్9 (ఆంధ్రజ్యోతి): ఖజానాశాఖలో జిల్లాస్థాయి పరిధిలో ఉన్న ఉద్యోగుల బదిలీలు సోమవారం ముగిశాయి. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న జిల్లా ఖజానాశాఖ ఆఫీస్‌లో అనంతజిల్లాశాఖ డీడీ వెంకటేశులు, శ్రీసత్యసాయిజిల్లాశాఖ డీడీ శ్రీనివాసరావుల సమక్షంలో ఉమ్మడి జిల్లాల ట్రెజరీ ఉద్యోగులకు బదిలీలను నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వీస్‌కాలం, రిక్వెస్ట్ బదిలీలు మొత్తం మీద 41 మందికి స్థానచలనం కలిగించారు. ఇందులో సీనియర్ అకౌంటెంట్‌లు 20మంది, జూనియర్ అకౌంటెంట్స్ ఎనిమిదిమంది. అటెండర్లు9మంది, డేటాఎంట్రీ ఆపరేటర్లు నలుగురు చొప్పున బదిలీ అయినట్లు డీడీ వెంకటేశులు తెలిపారు. ఎస్‌టీఓల బదిలీలు రాష్ట్రస్థాయి నుంచి ఇంకా రావాల్సిఉంది.

**ఆర్‌డబ్ల్యూఎస్‌లో...**

అనంతపురం న్యూటౌన్ జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో ఇద్దరు డీఈలను బదిలీ చేస్తూ సోమవారం ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం క్వాలిటీ కంట్రోల్ డీఈగా ఉన్న రామారావును రాయదుర్గం డీఈగా బదిలీ చేశారు. పుంగనూరులో డీఈగా ఉన్న కిరణ్‌తేజను ఉమ్మడి అనంత జిల్లా క్వాలిటీ కంట్రోల్ డీఈగా నియమించారు. రాయదుర్గం డీఈగా ఉన్న శ్రీనివాసులును సత్యసాయి బోర్డు డీఈగా నియమించారు. జేఈఈల బదిలీల్లో భాగంగా ఉరవకొండ ప్రాజెక్ట్ జేఈఈగా ఉన్న బాలకృష్ణను అనంతపురం క్వాలిటీ కంట్రోల్ జేఈఈగా నియమించారు. అనంతపురం డివిజన్ కార్యాలయంలో ఉన్న జేఈఈ సాయిశశాంక్‌ను ఈఎన్‌సీ కార్యాలయానికి బదిలీ చేశారు. అనంతపురం డివిజన్ కార్యాలయంలో జేఈఈగా ఉన్న శ్రీలతను ఈఎన్‌సీ కార్యాలయానికి బదిలీ చేశారు. అనంతపురం డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆదిశంకర్‌ను ధర్మవరం సబ్‌డివిజన్ కార్యాలయానికి బదిలీ చేశారు. సర్కిల్ కార్యాలయంలో ఉన్న మాధవయ్యను పెనుకొండ కు బదిలీ చేశారు. పులివెందులలో ఉన్న వెంకటప్రసాద్‌ను అనంతపురం సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేశారు. పెనుకొండలో ఉన్న నాగలక్ష్మమ్మను అనంతపురం క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ చేశారు. పుట్టపర్తి ఏటీఓగా ఉన్న రవికుమార్‌ను కళ్యాణదుర్గంకు బదిలీ చేశారు. కళ్యాణదుర్గంలో ఉన్న మహబుబ్‌బాషాను పుట్టపర్తికి బదిలీ చేశారు.

**మార్కెటింగ్ శాఖలో..**

అనంతపురంరూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖలో బదిలీల ప్రక్రియ సోమవారం రాత్రి జరిగింది. అనంతపురం మార్కెటింగ్ శాఖ ఏడీగా పనిచేస్తున్న సత్యనారాయణ చౌదరి గుంటూరు ఏడీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తునిలో స్పెషల్ గ్రేడ్ కార్యదర్శిగా పని చేస్తున్న రాఘవేంద్రకుమార్‌ను నియమించారు. అనంతపురం ఎంపిక శ్రేణి కార్యదర్శిగా ఓడీపై పని చేస్తున్న గోవిందును రెగ్యులర్ కార్యదర్శిగా నియమించారు. ఇక్కడ గతంలో కార్యదర్శిగా పని చేస్తూ ఓడీపై కర్నూలు ఎంపిక శ్రేణి కార్యదర్శిగా వెళ్లిన జయలక్ష్మిని అక్కడికే రెగ్యులర్ కార్యదర్శిగా నియమించారు. హిందూపురం స్పెషల్ గ్రేడ్ కార్యదర్శిగా పని చేస్తున్న చంద్రమౌళిని అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు. జిల్లాలోని మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి.

**వ్యవసాయ శాఖలో...**

అనంతపురం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

| సీనియర్ అసిస్టెంట్ | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| దేవేంద్ర | భూసార సంరక్షణా కేంద్రం, ఏటీపీ | రైతు శిక్షణా కేంద్రం, శ్రీ సత్యసాయి |
| మధుమతి | జేడీఏ ఆఫీస్, అనంతపురం | హిందూపురం ఏడీఏ ఆఫీస్ |
| సునీత | రైతు శిక్షణా కేంద్రం, శ్రీసత్యసాయి | భూసార సంరక్షణా కేంద్రం, ఏటీపీ |

# ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల బదిలీ

**28 మంది గ్రేడ్-1,**
**17 మంది గ్రేడ్-2 సూపర్‌వైజర్లు**
**ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌జేడీ రోహిణి**

అనంతపురం విద్య, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రేడ్ -1 సూపర్‌వైజర్లు, గ్రేడ్ -2 సూపర్‌వైజర్లను ఒక ప్రాజెక్టు నుంచి మరో ప్రాజెక్టుకు, పీడీ కార్యాలయాలకు బదిలీల చేస్తూ ఆర్‌జేడీ రోహిణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్ -1 సూపర్‌వైజర్లు 28 మందిని బదిలీల చేశారు. రాధను సోమందేవపల్లి ప్రాజెక్టుకు, గంగరత్నమ్మను పెనుకొండకు, ఓబుళమ్మను కంబదూరుకు, నాగమణిని నార్పలకు, ఉమారాణిని రాయదుర్గానికి, సన్నక్కను గుడిబండకు, నాగేశ్వరిని తాడిపత్రికి, భారతమ్మను కంబదూరుకు, లతాకిరణ్‌ను సీకేపల్లికి, హేమలతను అనంతపురం అర్బన్ ప్రాజెక్టుకు, అన్నపూర్ణదేవిని నార్పలకు, రఫీమున్నీసాను అనంతపురం పీడీ ఆఫీస్‌కు, గంగాభవానీ ధర్మవరం ప్రాజెక్టుకు, అలివేలమ్మను కదిరికి, రామలక్ష్మమ్మను బీ. కొత్తకోటకు బదిలీ చేశారు. కణేకల్లు ప్రాజెక్టుకు రాజమ్మ, ఈశ్వరమ్మను, ఉరవకొండ ప్రాజక్టుకు రమాదేవి, శ్రీదేవి, పుష్పవతిని, శింగనమల ప్రాజక్టుకు, కల్పన, విష్ణువర్ధని, నేతాజీబీని, గుత్తి ప్రాజెక్టుకు పద్మావతి, దస్తగిరమ్మ, రాజేశ్వరిని, కళ్యాణదుర్గం ప్రాజెక్టుకు లక్ష్మీదేవమ్మ, రాధమ్మను బదిలీ చేశారు. వీరితోపాటు మరో 17 మంది గ్రేడ్- 2 సూపర్‌వైజర్లను ఒక ప్రాజెక్టు నుంచీ మరో ప్రాజెక్టు బదిలీ చేశారు.

## మరో ఇద్దరికి కొవిడ్

**నాలుగుకు చేరిన కేసుల సంఖ్య**

అనంతపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో ఇద్దరికి సోమవారం కొవిడ్ నిర్ధారణ అయింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పాజిటివ్ కేసుల సంఖ్య నాలుగుకు చేరింది. పెద్దవడుగూరు మండలానికి చెందిన ఓ గర్భిణి జిల్లా ఆస్పత్రిలో ప్రసవించారు. ఆమె జ్వరం, జలుబుతో బాధపడుతుండటంతో కొవిడ్ పరీక్షలు చేయించారు. ఆమెకు కొవిడ్ సోకినట్లు తేలింది. దీంతో ఆస్పత్రిలోని కొవిడ్ వార్డుకు తరలించి, చికిత్స చేస్తున్నారు. అనంతపురం రామ్‌నగర్‌కు చెందిన 30 ఏళ్ల మహిళ అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా ఆస్పత్రికి సోమవారం వచ్చారు. కొవిడ్ లక్షణాలు ఉండటంతో పరీక్షలు నిర్వహించారు. పాజిటివ్ వచ్చింది. హోమ్ ఐసోలేషన్‌లో ఉంటానని చెప్పడంతో ఆమెకు అవసరమైన మందులు ఇచ్చి పంపించామని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే అనంతపురం పాతూరులో ఓ గర్భిణికి, ధర్మవరంలో మరో గర్భిణికి పాజిటివ్ వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని నాలుగు పాజిటివ్ కేసులూ మహిళలవే కావడం, అందులో ఇద్దరు గర్భిణులు, ఒకరు బాలింత కావడం గమనార్హం. కాగా, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి కొవిడ్‌తో కర్నూలు జిల్లాలో చికిత్స పొందుతున్నారు.

# నేడు విచారణకు పైలెట్ అనిల్

చెన్నేకొత్తపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం కుంటిమద్ది హెలీప్యాడ్ వద్ద ఏప్రిల్ 8న చోటుచేసుకున్న ఘటనపై విచారణకు పైలెట్ అనిల్‌కుమార్ మంగళవారం హాజరవుతున్నారు. మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద వైసీపీ శ్రేణులు హెలికాప్టర్‌ను చుట్టుముట్టడం, విండ్ షీల్డ్ దెబ్బతిందని జగన్‌ను తిరిగి తీసుకువెళ్లకుండానే పైలెట్ హెలికాప్టర్‌ను తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా పైలెట్ అనిల్ కుమార్‌కు పోలీసులు నాలుగుమార్లు నోటీసులు ఇచ్చారు. మూడు నోటీసులకు వివిధ కారణాలు చూపి గైర్హాజరైన ఆయన.. ఎట్టకేలకు విచారణకు హాజరు అవుతానని విచారణ అధికారి రామగిరి సీఐ శ్రీధర్‌కు సమాచారం ఇచ్చారు. చెన్నేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు పైలెట్ విచారణకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. జూన్ 10న విచారణకు రావాలని పోలీసులు మే 21న తేదీన వాట్సాప్ ద్వారా 4వ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇదివరకే కో పైలెట్ శ్రేయస్ జైన్‌ను పోలీసులు విచారించారు. హెలీప్యాడ్ కేసులో ప్రధాన నిందితుడు, వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహా సుమారు 70 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలను ఇదివరకే పోలీసులు విచారించారు. పైలెట్ అనిల్ కుమార్ విచారణ పూర్తి అయితే హెలీప్యాడ్ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

# అంతా పాస్

**డిగ్రీ ఇన్‌స్టంట్‌లో వందశాతం ఉత్తీర్ణత**

అనంతపురం సెంట్రల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించి డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షా ఫలితాల్లో వందశాతం విద్యార్థులు పాస్ అయ్యారు. ఈ మేరకు సోమవారం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ ఫలితాలను విడుదలచేసి మాట్లాడారు. డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు మిగిలిపోయిన విద్యార్థులకు ఆదివారం పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. బీఏ, బీబీఏ, బీసీఏ, బీకామ్, బీఎస్సీ విద్యార్థులు మొత్తం 137మంది పరీక్షలు రాయగా అందరూ పాస్ అయ్యారన్నారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్లో ప్రదర్శించామని, విద్యార్థులు సర్టిఫికెట్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ శంకర్, సిబ్బంది సాయిశివ, దేవా, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా-డీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మా-డీ పరీక్షల ఫలితాలను సోమవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలలో ఐదో సంవత్సరం (ఆర్17) విద్యార్థులకు రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల ఫలితాలను [illegible] వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ శివకుమార్, ఈసీలు ప్రొఫెసర్ శంకర్‌శేఖర్, శ్రీధర్, అంకారావు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ సీఈఓగా శివశంకర్



అనంతపురం విద్య, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓగా శివశంకర్‌ను నియమిస్తూ పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న రామచంద్రారెడ్డిని ప్రభుత్వం ఉన్నఫలంగా బదిలీ చేయడంతో సీఈఓ పోస్టు ఖాళీ పడింది. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా ధర్మవరం డ్వామాలో ఏపీడీగా పనిచేస్తున్న శివశంకర్‌ను జడ్పీ సీఈఓగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో 468 విడుదల చేసింది.

## క్రైం కార్నర్

### రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు- తిమ్మనచెర్ల రైలు మార్గంలో ఆదివారం రాత్రి గుంతకల్లు పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన బోయ అనిత(30) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. అనిత భర్త సుధాకర్ బేల్దారి పని, అనిత కూలి పనులు చేస్తూ జీవించేవారు. సుధాకర్ మద్యానికి బానిసై పనికి వెళ్లే వాడుకాదన్నారు. భార్య కూలి పనులకు వెళ్లి తెచ్చిన డబ్బును సైతం తీసుకుని మద్యం సేవించేవాడన్నారు. దీంతో తన నలుగురు పిల్లలను ఎలా పోషించాలో తెలియక అనిత బాధపడుతుండేదన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్ సమీపంలోని సరస్వతి విద్యామందిరం వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి మీద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ తెలిపారు.

### కడుపు నొప్పి తాళలేక డ్రైవర్..


మహబూబ్‌బాషా (ఫైల్)

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక మహబూబ్‌బాషా (58) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం యాడికిలోని ఆంజనేయస్వామికాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు మహబూబ్‌బాషా సొంత లగేజీ బొలెరో వాహనం బాడుగలకు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కడుపునొప్పితో తరచూ బాధపడుతుండే వాడు. పలు చోట్ల వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. దీంతో జీవితం మీద విరక్తి చెంది సోమవారం తెల్లవారు జామున ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య మహబూబ్‌బీ, వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తాడిపత్రికి తరలించారు.

### విద్యుదాఘాతంతో యువకుడి మృతి


శివ మృతదేహం

గుంతకల్లుటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైటీచెరువు గ్రామంలో కేసరి శివ(19) సోమవారం ఇంట్లో కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన మేరకు వెంకటేష్, లక్ష్మీదేవి దంపతులు వ్యవసాయం చేసుకుని జీవించేవారు. వీరికి శివ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి వ్యవసాయ పనుల్లో శివ తోడుగా ఉండేవాడు. మధ్యాహ్నం ఇంట్లో మోటార్‌కు ప్లగ్ పెడుతుండగా షాక్ కొట్టి కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు శివను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెంది నట్లు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### తల్లి, కుమార్తె అదృశ్యం


లేహన్య, అపురూప

కళ్యాణదుర్గం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురాకులతోట గ్రామానికి చెందిన తల్లీకూతురు అపురూప, లేహన్యా ఈ నెల 6 నుంచి కనిపించడం లేదని బంధువులు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందినట్లు సీఐ యువరాజు తెలిపారు. బంధువుల ఇళ్లల్లోను, చుట్టుపక్కల గ్రామాల్లోను తల్లీకూతురి ఆచూకీ కోసం వారు ప్రయత్నించినా సమాచారం లభ్యం కాలేదన్నారు. దీంతో సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ యువరాజుకు బంధువులు ఫిర్యాదు చేశారు. ఆచూకీ దొరికితే 7386400113, 9490106284 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

### తాడిపత్రిలో బాలుడు..


గణేష్

తాడిపత్రి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన మల్లికార్జున కుమారుడు గణేష్ (15) అనే బాలుడు రెండురోజులుగా కనిపించలేదని పట్టణ పోలీసులు తెలిపారు. గణేష్ 9వతరగతి చదువుతున్నాడని, ఇంటివద్ద ఉండకుండా బయటకు ఆటల కోసం వెళుతుంటే తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయాడని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 9440796861, 9346917120 నెంబర్లకు ఫోన్‌చేయాలని ఆయన పేర్కొన్నారు.

### యాడికిలో యువతి..

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన యువతి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదని తెలిపారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

### ఉరవకొండలో బాలిక..

ఉరవకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెరిమెట్ల గ్రామానికి చెందిన బాలిక (17) నాలుగు రోజుల క్రితం అదృశ్యమయినట్లు తండ్రి సోమవారం ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన బాలిక తన అవ్వ(అమ్మమ్మ) ఊరు, ఉరవకొండ మండలంలోని నెరిమెట్లకు వెళ్లింది. 6వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని తన అవ్వకు చెప్పింది. తిరిగి ఇంటికి రాలేదు. పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవటంతో తండ్రి ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### మోసగించిన కేసులో యువకుడి అరెస్ట్

కదిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యువతిని మోసం చేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన కేసులో పుట్టపర్తి మండలంలోని దిగువచెర్లోపల్లికి చెందిన ప్రకాష్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... కదిరి పట్టణానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని ప్రకాష్ మోసం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ యువతి ఈనెల 3న ఎలుకల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై ఆమె తండ్రి ఫిర్యాదు ఇచ్చారన్నారు. ఈ కేసులు పరారీలో ఉన్న నిందితుడిని సోమవారం అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు చెప్పారు.



# గాలివాన బీభత్సం..

- దెబ్బతిన్న పంటలు
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- మునిగిన పంట పొలాలు
- పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు
- ఉద్యాన రైతులకు భారీ నష్టం


కణేకల్లు వద్ద వేదవతి హగరిలో ప్రవహిస్తున్న వర్షపునీరు


పెద్ద కొట్టాలపల్లి వద్ద వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న పొలాలు


బొమ్మనహాళ్ మండలంలో నేలకొరిగిన అరటి చెట్లు

బొమ్మనహాళ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు అరటి, విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి. పత్తి పంటలో నీరు చేరి కాయలు రాలి, పత్తి తడిసిపోయింది. బొమ్మనహాళ్ మండలంలోని గోనేహాళ్ గ్రామం వద్ద 10 విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్‌తో సహా కూలిపోయాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రాత్రి నుంచి ఉదయం వరకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఎల్బీనగర్‌లోని వెంకటరెడ్డికి చెందిన ఆరు ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట నెలకొరిగింది. గోనేహాళ్‌క్రాస్‌లో ఇమ్రాన్ అనే వ్యక్తికి చెందిన మెకానిక్ షాప్‌పై చెట్టు పడి బండలు విరిగిపడ్డాయి. మండల కేంద్రంలో 7.2 మి.మీ వర్షపాతం నమోదయింది.

- కణేకల్లు : మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వేదవతి హగరి పొంగిపొర్లింది. ఆదిగానిపల్లి వద్ద పంటపొలాలు నీట మునిగాయి. బోరుబావుల ద్వారా సాగుచేసిన పత్తిపంట నీట మునిగింది. వరదనీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కల్వర్టు మరమ్మతులకు గురవ్వడంతో వర్షపు నీరంతా పొలాల్లో నిలిచిందని సర్పంచ్ రుద్రముని తెలిపారు.
- బెళుగుప్ప : మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు వర్షపునీటితో పొంగిపొర్లాయి. సేద్యపు పనులు చేయడానికి అనుకూలంగా వుంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


బొమ్మనహాళ్ మండలంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం

### 26 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 26 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఉరవకొండలో 70.6 మీ.మీ. వర్షపాతం నమోదైంది. శెట్టూరు 56.4, ఆత్మకూరు 40.8, బ్రహ్మసముద్రం 40.4, కణేకల్లు 37.4, కళ్యాణదుర్గం 32.2, బెళుగుప్ప 30.4, గుంతకల్లు 23.4, కంబదూరు 22.6, కుందుర్పి 18.6, బుక్కరాయసముద్రం 9.2, బొమ్మనహాల్ 7.2, విడపనకల్లు 4.4, తాడిపత్రి, యల్లనూరు 4.2, పెద్దపప్పూరు 4.0, పామిడి 3.4, గుత్తి 3.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 2.8 మీ.మీలోపు వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు.

- రాయదుర్గంరూరల్ : మండలంలో ఆదివారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. వేపరాల, మల్కాపురం, జుంజురంపల్లి, కదరంపల్లి, రేకులకుంట తదితర గ్రామాలలో వర్షం కురవడంతో వంకలు, వాగులు, చెక్‌డ్యాంలలో నీరు చేరి జలకళ సంతరించుకుంది. వ్యవసాయ పనులను చేసుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- శెట్టూరు : మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి 56.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి తెలిపారు. మృగశిర కార్తె ఆరంభంలోనే మంచి వర్షాలు రావడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాగులు, వంకలు చిన్నపాటి చెక్‌డ్యామ్‌లలో నీరు చేరింది.
- విడపనకల్లు : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పెద్ద కొట్టాలపల్లి వద్ద వర్షపునీటితో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వంకలు పొంగిపొర్లాయి. అంచనహాలు-పొలికి గ్రామాల మధ్యలోని పెద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో అంచనహాలు పొలికి ఉరవకొండ గ్రామాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ రాక పోకలు నిలిచి పోయాయి. వంక ఉధృతికి అటు వైపు ఎవరూ వెళ్లకుండా రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ నిర్వహించారు.
- ఉరవకొండ : పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. 76.6మీ.మీ వర్షపాతం నమోదైంది. బూదగవి చెరువులోకి భారీగా వరదనీరు చేరింది. ఉరవకొండలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైవర్స్ కాలనీ, హమాలి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## కుప్పకూలిన బీర పంట

- 80 ఎకరాల్లో పంట ధ్వంసం
- రూ.కోటి వరకు నష్టం

కళ్యాణదుర్గం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సంతో బీర రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఆదివారం అర్ధరాత్రి విపరీతమైన ఈదురు గాలులతో కురిసిన వర్షం ధాటికి పందిరి వేసిన పంట నేలమట్టమయింది. సోమవారం ఉదయం తోటల్లోకి వెళ్లిన చూసిన రైతులు కుప్పకూలిన పంటను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 80 ఎకరాలకు పైగా బీర పంటను సాగు చేశారు. దాదాపు రూ. కోటి వరకు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో కోత కోయాల్సిన బీర పంట ఈదురుగాలులకు నేలమట్టమయింది. దీంతో రైతులు భారీగా నష్టపోయారు. కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లి, జెల్లిపల్లిలోనే సుమారు 20 ఎకరాలకు పైబడి 10 మంది రైతులు సాగు చేశారు. ఈ రెండు గ్రామాల్లోనే అత్యధికంగా నష్టపోయారు. జెల్లిపల్లికి చెందిన నూర్ అనే రైతు మాట్లాడుతూ.. నాలుగు ఎకరాల్లో బీర పంటను సాగు చేశానని, సుమారు రూ. 4 లక్షలు ఖర్చు చేశానని తెలిపారు. రెండు రోజుల్లోనే కోత కోయాల్సి ఉండేదన్నారు. పంట అంతా కుప్పకూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటారెడ్డిపల్లికి చెందిన వక్కల రాజు అనే రైతు మాట్లాడుతూ.. తనకున్న రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన బీర పంటంతా కుప్పకూలిపోయిందన్నారు. సుమారు రూ. 2 లక్షలు నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.


జెల్లిపల్లి వద్ద నేలకొరిగిన బీర పంటకు వేసిన పందిరి

## అత్యాచారాల నివారణకు పటిష్ట చర్యలు ఏవీ..?

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకీ ఉమ్మడి జిల్లాలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతుండటం దురదృష్టకరమన్నారు. నిందితులు మద్యం మత్తులో ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నారని పేర్కొన్నారు. చిలమత్తూరు మండలంలో అత్తాకోడళ్లపై జరిగిన అత్యాచారం, రామగిరి మండలం మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం, అనంతపురం రూరల్ మండలానికి చెందిన బాలిక హత్య జరిగినతీరుతో సభ్యసమాజం తల దించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ ఘటనపట్ల పోలీసులు రాజకీయనాయకులకు దాసోహం కావడం బాధితులకు మరోసారి అన్యాయం చేసినట్లే అవుతుందని విమర్శించారు. మహిళా కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనలనై సమగ్రంగా విచారించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రమ్మ, రామిరెడ్డి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


గంగప్ప (ఫైల్)

కుందుర్పి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానంపల్లికి చెందిన రైతు గంగప్ప(55) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగప్ప తనకున్న నాలుగెకరాల పొలంలో టమోటా, కర్బూజా, పత్తి పంటలను సాగు చేసేవాడు. పంటలు చేతికి రాక నష్టపోయాడు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చే మార్గంలేక తీవ్ర ఆవేదన చెందుతుండేవాడు. ఈనేపథ్యంలో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువుల ఊరికి వెళ్లి ఉంటాడనుకున్నారు. ఆదివారం సాయంత్రం గ్రామ చివర గుట్ట ప్రాంతంలో దుర్వాసన వస్తుండడాన్ని పశువుల కాపర్లు గుర్తించారు. అక్కడికెళ్లి చూడగా మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. విషయం గ్రామస్థులకు తెలపడంతో వారు వచ్చి చూసి, గంగప్పదిగా గుర్తించారు. ఏఎస్ఐ వెంకటేష్.. రైతు మృతదేహాన్ని పరిశీలించారు. సోమవారం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గంగప్పకు భార్యలు ఈరక్క, సావిత్రమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రైతు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

### చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33వేలు ధర పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 845టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ఆశయం

- ప్రాధాన్యాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి
- జిల్లా అధికారులకు సీఎం ఆదేశాలు

అనంతపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ఆశయమనీ, అందుకు అనుగుణంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఏడాది పాలన ముగిసిన సందర్భంగా సోమవారం కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సీఎం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకే స్వర్ణాంధ్ర విజన్-2047 అమలు చేస్తున్నామన్నారు. ఆ మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, గ్రామాల వారీగా వేర్వేరు ప్రాధాన్యతలు ఉంటాయన్నారు. ఈ నాలుగురకాల ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

### అనంత జిల్లా ప్రణాళిక వెల్లడి

స్వర్ణాంధ్ర విజన్-2047కు అనుగుణంగా అనంత జిల్లాలో ప్రాధాన్యతల వారీగా ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం చంద్రబాబునాయుడుకు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సీఎం కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. రాయదుర్గం నియోజకవర్గంలో పరిశ్రలు అభివృద్ధి, మైనింగ్, వ్యవసాయం, ఉద్యాన రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో హార్టికల్చర్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాలు, ఉరవకొండలో నీటిపారుదల, ఉద్యానం, గుంతకల్లులో రైల్వేటూరిజం, అర్బన్ డెవలప్‌మెంట్, వ్యవసాయం, తాడిపత్రిలో పరిశ్రమలు, హార్టికల్చర్, టూరిజం, శింగనమలలో హార్టికల్చర్, రియల్ ఎస్టేట్, రెన్యువబుల్ ఎనర్జీ, అనంతపురం అర్బన్‌లో విద్య, వైద్యం, రాప్తాడులో పరిశ్రమలు, రియల్‌ఎస్టేట్, ఉద్యానరంగాలుకు ప్రాధాన్యమిస్తూ ప్రణాళికలు రూపొందించామని సీఎంకి కలెక్టర్ వినోద్‌కుమార్ వివరించారు. కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖజేడీ ఉమామహేశ్వరమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, రాజగోపాల్, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఎల్‌డీఎం శ్రీనివాస్‌యాదవ్, డ్వామా పీడీ సలీంబాషా, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి పాల్గొన్నారు.

## గోకులం గోడు..!

- బిడ్డ బంగారం.. బైక్ తాకట్టు పెట్టి కట్టా..
- బిల్లులు ఇంకెప్పుడిస్తారు?
- ఎంపీడీఓ ఎదుట లబ్ధిదారుడి ఆవేదన


ఎంపీడీఓ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న గోకులం షెడ్డు లబ్ధిదారులు

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల బిల్లులు అందక లబ్ధిదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఒక్కొక్కరిది ఒక్కో వ్యథ. అప్పులు చేసి.. షెడ్లు కట్టుకున్నామనీ, నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోతే ఎలాగని మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన పలువురు గోకులం లబ్ధిదారులు సోమవారం ఎంపీడీఓ వీరరాజు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. నీలకంఠ అనే గోకులం లబ్ధిదారుడు మాట్లాడుతూ.. గోకులం నిర్మాణం పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో అప్పులు చేసి, షెడ్లు కట్టుకున్నామన్నారు. సంక్రాంతి సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా గోకులం షెడ్లను ప్రారంభించారన్నారు. ఆరునెలలు దాటినా ఇంతవరకు బిల్లులు పడలేదని తెలిపాడు. గోకులం నిర్మాణం కోసం అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక కూతురి బంగారాన్ని రూ.65వేలకు, బైక్‌ను రూ.35వేలకు తాకట్టు పెట్టాల్సి వచ్చిందన్నాడు. రేకులు అప్పుగా ఇచ్చిన వారు.. వాటిని ఊడదీసుకుపోతామంటున్నారని తెలిపాడు. అదే జరిగితే తనకు ఆత్మహత్యే శరణ్యమని వాపోయాడు. గోకులం షెడ్డు నిర్మాణ పనుల బిల్లులు తక్షణమే అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశాడు. కార్యక్రమంలో లబ్ధిదారులు హరి, పెద్దన్న, రామాంజనేయులు, పెద్దిరాజు పాల్గొన్నారు.

## పోలీసుల నిర్లక్ష్యంతోనే తన్మయి హత్య

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత


మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, జూన్9(ఆంధ్రజ్యోతి): పోలీసుల నిర్లక్ష్యంతోనే ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య జరిగిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు. రాష్ట్రంలో ఏడాది వ్యవధిలో 188మందిపై అత్యాచారాలు జరిగాయన్నారు. అలాగే 15మందిని అత్యాచారం చేసి హత్య చేశారన్నారు. చంబల్‌లోయలో కంటే రాష్ట్రంలో దారుణ పరిస్థితులు ఉన్నాయన్నారు. జిల్లాలో 72 మంది మహిళల మిస్సింగ్ కేసులున్నాయన్నారు. అమ్మాయిలు అదృశ్యమయ్యారని ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

### వైసీపీ నాయకుల నిరసన

తన్మయి హత్య నేపథ్యంలో విద్యార్థిని కుటుంబసభ్యులతో కలిసి వైసీపీ నేతలు జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ విద్యార్థిని హత్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. నిర్లక్ష్యంతోనే హత్య జరిగిందన్నారు. ముందుగానే అప్రమత్తమై ఉంటే ప్రాణాలు నిలిచేవన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల కోసమే స్పర్శ్ సెంటర్లు

- ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప

అనంతపురం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప పేర్కొన్నారు. ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో సోమవారం స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణను రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట్‌రెడ్డి వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా తిమ్మప్ప మాట్లాడుతూ మాజీ సైనికులు, సైనిక వితంతువులు, అమర జవాన్‌ల కుటుంబ సభ్యుల పెన్షన్ సమస్యలు, పేర్ల సవరణలు తదితర అంశాల సత్వర పరిష్కారం కోసం స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్లు పనిచేస్తాయన్నారు. సమస్యల పరిష్కారానికి సెంటర్ల నిర్వాహకులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో అన్ని అంశాలపై శ్రద్ధతో అవగాహన పొందాలన్నారు. అలాగే అన్ని జిల్లాల్లోని మాజీ సైనికులకున్న స్పర్శ్ పెన్షన్ వెబ్ యాప్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లాకు చెందిన ట్రైనర్ శ్రీనివాస వరప్రసాద్, లక్ష్మణరావు, రాయలసీమ జిల్లాల స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వాహకులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది గిరీష్, బాబా ఫక్రుద్దీన్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిమ్మప్ప

## సజ్జల వ్యాఖ్యలు అహంకారానికి పరాకాష్ట

● ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న

అనంతపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అమరావతి మహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి పరాకాష్ట అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు గాజుల ఆదెన్న మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ... మహిళలను అవమానపరిచే విధంగా సాక్షి ఛానల్‌లో ఆ ఛానల్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌రావు, అనలిస్ట్ పేరుతో మరో జర్నలిస్టు కృష్ణం రాజు చేసిన వ్యాఖ్యలపై యావత్ మహిళా లోకం నిరసన గళం వినిపిస్తోందన్నారు. ఇలాంటి సందర్భంలో సంయమనం పాటించాల్సిన సజ్జల రామకృష్ణారెడ్డి మరో మారు అమరావతి మహిళలను అవమానపరిచే విధంగా... పిశాచులు.. రాక్షసులు.. సంకర తెగ అంటూ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను వైసీపీ చిన్నచూపు చూస్తోందనేందుకు ఈ రెండు ఘటనలు అద్దం పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్చుకోలేక, వైసీపీ నేతలు మహిళలను తూలనాడుతూ డైవర్షన్ రాజకీయాలు చేస్తూ పబ్బంగడుపుకుంటున్నారని మండిపడ్డారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆ ఇద్దరు జర్నలిస్టులతోపాటు సజ్జలపైనా చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రం ఇస్తున్న తెలుగు మహిళలు

శింగనమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌కు చెందిన న్యూస్ చానల్ రాష్ట్ర రాజధాని అమరావతికి చెందిన మహిళ మహిళలను కించ పరిచేలా వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు,కృష్ణరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని శింగనమల గ్రామ వార్డు మెంబర్లు ఎం.వెంకటలక్ష్మి సర్వసతి,తెలుగు మహిళలు మాబ్‌జాన్, స్వర్ణలత, భాగ్యలక్ష్మి వెంకటలక్ష్మి,,మీనాక్షి తదితరులు శింగనమల పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

## గూగూడు బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

నార్పల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామంలో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను డీఎస్పీ వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు వచ్చే భక్తులు అసౌకర్యానికి గురికాకుండా, ట్రాఫిక్ సమస్య రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, బస్సులు ఎక్కడ పార్క్ చేయాలనే దానిపై గ్రామస్థులతో చర్చించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ పాల్గొన్నారు.

## సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: ఎంపీడీఓ

రామగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీఓ గంగావతి అధికారులకు సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ కరైన్న అధ్యక్షతన జరిగింది. ఇందులో ఎంపీడీఓ మాట్లాడుతూ.. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ప్రజాసమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఆ దిశగా అధికారులు ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. తర్వాత ప్రజా ప్రతినిధులు పలు సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు, సంపత్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, ఎంఈఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ కమలాబాయి, ఏఎస్‌ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా దివాకర్

అనంతపురం న్యూటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా దివాకర్‌ను నియమిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంతరాము సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొద్దుటూరు సబ్‌డీఎఫ్ఓగా ఉన్న ఆయన్ను ఇక్కడకు నియమించారు. ఇదివరకు ఇన్‌చార్జి బాధ్యతలు విఘ్నేష్ చేపట్టారు. ఆయన వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లడంతో తాత్కాలికంగా కర్నూల్ డీఎఫ్ఓ శ్యామల ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక ఎట్టకేలకు రెగ్యులర్ డీఎఫ్ఓను నియమించారు.

## సోషల్ ఫారెస్ట్ రేంజర్‌గా శ్రీపతినాయుడు

అనంతపురం న్యూటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం సోషల్ ఫారెస్ట్ రేంజర్‌గా శ్రీపతినాయుడును నియమిస్తూ సోమవారం పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది ఇక్కడ రేంజర్‌గా ఉన్న డేవిడ్ బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి రెగ్యులర్ రేంజర్‌ను నియమించలేదు. తాత్కాలికంగా టెరిటోరియల్ అనంతపురం రేంజర్ శ్రీనివాసులుకు బాధ్యతలు అప్పగించారు. ఆయన ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతుండటంతో డీఆర్వోగా ఉన్న దీపకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఎట్టకేలకు ఖాళీగా ఉన్న ఆ స్థానంలో నంద్యాల జిల్లా రుద్రవరం రేంజర్‌గా ఉన్న శ్రీపతినాయుడును నియమించారు.

## దళిత, గిరిజన మహిళలకు రక్షణ కల్పించాలి

అనంతపురం సెంట్రల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన సామాజిక మహిళలు బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. ఇంటర్ విద్యార్థి తన్మయిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. దళిత, గిరిజన సామాజిక వర్గానికి చెందిన బాలికలు, మహిళలపైనే అత్యాచారాలు, హత్యలు జరుగుతుండటం విస్మయం కలిగిస్తోందన్నారు. రామగిరి మండలంలో జరిగిన దారుణం మరువకముందే నగరానికి చెందిన మరో బాలికను హత్యచేయడం దారుణమన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన కుల, ప్రజా సంఘాల నాయకులు సాకేహరి, శ్రీనివాసులు, ఓబులేసులు నిందితులను కఠినంగా శిక్షించాలని వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బంజారా సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆ కార్యక్రమాల్లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు టీఎస్ వలి, వేమన, సుజాతమ్మ పాల్గొన్నారు.

## తన్మయి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలో దారుణ హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని తన్మయి కుటుంబానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం ఆర్థిక సాయం చేశారు. ఘటన గురించి తెలుసుకున్న వెంటనే ఆయన ఎస్పీ జగదీష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దర్యాప్తు వేగవంతం చేసి నిందితుల్ని కఠినంగా శిక్షించేలా చూడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సూచనల మేరకు టీడీపీ నాయకులు తన్మయి ఇంటికి వెళ్లి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. దగ్గుపాటి కూడా తన్మయి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే నాయకుల ద్వారా వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయరాంనాయుడు, సర్పంచు ఉదయ్ శంకర్, నాయకులు సుందర్, అశోక్, స్వప్న, సంఘ తేజస్విని, మహేశ్వరి, కంఠాదేవి, ఫరీదా, వరాలమ్మ, అలివేలమ్మ, అయేషా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● ప్రతి ఒక్కరూ నిత్యం యోగాసనాలు వేయాలి

● యోగాంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే పరిటాల సునీత



రాప్తాడులో యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, కనుక ప్రతిఒక్కరూ నిత్యం యోగా చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం రాప్తాడులో అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుంచి వాటర్ ట్యాంకు వరకూ జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నెల రోజులు యోగాపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి రోజూ యోగా చేస్తే ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా యోగా చేయడం అలవాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామ్మోహన్, డీసీఎంస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ తహసీల్దార్లు విజయకుమారి, లక్ష్మీనాయక్, మోహన్‌కుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మి, టీడీపీ మండలాల కన్వీనర్లు కొండప్ప, శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచులు తిరుపాలు, శీనయ్య, నరేష్, ఉజ్జినప్ప తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురంరూరల్: మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ పరిధిలో గల మల్లయ్య కాలనీ, రాచానపల్లి పంచాయతీలోని సిండికేట్ నగర్ తదితర గ్రామాల్లో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ దివాకర్, టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, చిన్నంపల్లి సర్పంచు శివశంకర్, రాచానపల్లి సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఫీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● నార్పల: మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మమతా దేవి, సర్పంచ్ మన్నిల సుప్రియ, ఈఓఆర్డీ శైలజరాణి, ఏపీఎం తిప్పమ్మ, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, పరుశురామ్, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, సత్యసాయి ఆశ్రమం చిన్నారులు, స్థానికులు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి: మండలకేంద్రంలో యోగాంధ్ర ర్యాలీని చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ కూడలివరకు సాగింది. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి యోగా ప్రాధాన్యత గురించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలకృష్ణుడు , తహసీల్దార్ సురేష్‌కుమార్, మండలవైద్యాధికారి రవినాయక్, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, ఏఓ ఉదయ్‌కుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబిలేసు, ఉపాధి, వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● శింగనమల: మండలకేంద్రంలో అధికారులు యోగాంధ్రపై ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్ ఎంఈఓ నరసింహరాజు, ఏఈలు శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఈఓఆర్డీ నరసింహారెడ్డి, ఐసీడీఎస్ సుపవైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అయితే ర్యాలీపై సరైన సమాచారం లేక రెవెన్యూ సిబ్బంది పాల్గొనలేకపోయారు.

# తన్మయిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న డిమాండ్

● మృతురాలి కుటుంబానికి పరామర్శ


క్లాక్‌టవర్ వద్ద రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కులానికి చెందిన తన్మయిని అత్యంత దారుణంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న డిమాండ్ చేశారు. స్థానిక రామకృష్ణ కాలనీలో తన్మయి తల్లిదండ్రులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తన్మయి కనిపించకపోవడంతో అదే రోజే వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. అనుమానితుని పేరు, అడ్రస్, సెల్ నంబర్ పూర్తి వివరాలు అందించినా అక్కడి పోలీసులు నిర్లక్ష్యం వహించారన్నారు. పోలీసులు బాధ్యతారాహిత్యంతో విద్యార్థి తన్మయి శవమై కనిపించిందని ఆరోపించారు. పోలీసులు సకాలంలో స్పందించి లోతుగా విచారణ చేసి ఉంటే ఇంతటి అఘాయిత్యం జరిగేది కాదని బాధిత తల్లిదండ్రులు వాపోతున్నారన్నారు. తన్మయిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించడంతోపాటు పోలీసుల బాధ్యతా రాహిత్యంపైనా విచారణ చేసి, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్పీ ప్రత్యేక చొరవ చూపాలని ఆయన కోరారు.

● అనంతపురం కల్చరల్: ఇంటర్ విద్యార్థిని తన్మయిని హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజురోజుకీ జరుగుతున్న దాడులను చూస్తుంటే మహిళలకు రక్షణ కరువైందని స్పష్టమవుతోందన్నారు. ఈ దాడులు, అత్యాచారాలు, హత్యలపై ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఎన్జీఓ హోంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామ న్నారు. సమావేశానికి మేధావులు, కవులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### నిర్లక్ష్యం వహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్ : తన్మయి తప్పిపోయిన కేసులో పోలీసులు ప్రదర్శించిన నిర్లక్ష్యం వల్లే సదరు బాలిక హత్యకు గురైందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వన్‌టౌన్ పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. తన్మయిని హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ కూడలి వద్ద సోమవారం సాయంత్రం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో వరుసగా విద్యార్థినులపై అత్యాచారాలు, హత్యల ఘటనలు కలచివేస్తున్నాయన్నారు. రామగిరి మండలంలో దళిత బాలికపై జరిగిన అత్యాచారం ఘటన మరవకముందే అనంతపురం రూరల్‌లో ఇంటర్ విద్యార్థిని తన్మయి అతి కిరాతకంగా హత్యకు గురైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలిక ఇంటినుంచి కనబడకుండా పోయినపుడే తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అయితే పోలీసులు నామమాత్రపు చర్యలతో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారంటూ మండిపడ్డారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోలీసు కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాస్తారోకో వల్ల కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వలి, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, సీఐటీయూ నగర అధ్యక్షుడు వెంకటనారాయణ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ లక్ష్మీనరసమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 90శాతం సబ్సిడీతో విత్తనకాయలు అందించాలి

● సీపీఐ, రైతుసంఘం నాయకుల డిమాండ్



అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

అనంతపురం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతులకు 90శాతం సబ్సిడీతో నాణ్యత కలిగిన అన్ని రకాల పంటల విత్తనాలు అందించాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, రైతు సంఘం మండల కార్యదర్శి మన్నీల వెంకటరాముడు మాట్లాడారు. రైతులకు, కౌలు రైతులకు 90శాతం సబ్సిడీతో నాణ్యత కలిగిన అన్ని పంటల విత్తనాలు అందించాలని అన్నారు. అలాగే తక్షణమే అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందించాలని, గ్రామ సభలు నిర్వహించి భూయజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎటువంటి హామీ లేకుండా కౌలు రైతులకు రూ.రెండు లక్షల వరకు పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వన్నారెడ్డి, శ్రీకాంత్, రమేష్, గోవిందు నాయక్, రాకెట్లరాము, నగేష్, అక్కులప్ప, నరసింహులు, కుల్లాయప్ప, మన్నీల సూరి తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ నాయకులు మధుయాదవ్, బయన్న, చంద్రశేఖర్, నేసేమధు పాల్గొన్నారు.

● గార్లదిన్నె: మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం, ఏఐవైఎఫ్ నాయకులు ఆందోళన చేశారు. తర్వాత బండారు ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రీనాథ్, ఎండీ రాముడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శంకర్, ఓబన్న, కాశీ విశ్వనాథ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

● నార్పల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసుల మూర్తికి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మధుయాదవ్, మండల కార్యదర్శి లలితమ్మ, సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్, సహాయ కార్యదర్శులు చాపల రామాంజి, సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్ద పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

●రామగిరి: 90శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలను అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం నాయకులు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయసిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ్, ముత్యాలప్ప, సీపీఐ నాయకులు బాలరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

## ఉద్యోగాలకు 61మంది ఎంపిక

అనంతపురం సెంట్రల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఐటీఐ పూర్తిచేసిన 61మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. కళాశాలలో సోమవారం ఉద్యోగ ఇంటర్వ్యూలను నిర్వహించారు. బెంగళూరు ఎల్ఎంఎస్ కార్పొరేషన్ సర్వీసెస్ కంపెనీ, అన్నపల్ ఎఫ్‌సీఐ, అభ్యుదయ సేఫ్టీ సెక్యూరిటీ సొల్యుషన్స్ సంస్థ ప్రతినిధులు విద్యార్థులను ఇంటర్వ్యూచేసి ప్రతిభ కనబరచిన న వారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు నాగరాజు, రామమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల నుంచి తరలివచ్చిన విద్యార్థులు ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబర్చారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన 61మందికి నెలకు రూ.19వేల చొప్పున వేతనం చెల్లిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు ఎంపికపత్రాలందజేసి అభినందించారు.

## త్వరలో సబ్సిడీపై దాణా పంపిణీ

.నార్పల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామంలో పాడి రైతులకు సబ్సిడీపై త్వరలో దాణా పంపిణీ చేస్తామని ఉపసర్పంచ్, టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకట నరసానాయుడు పేర్కొన్నారు. గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. దాణా కొరతతో పాడి రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. తెల్లకార్డు కలిగిన పాడి రైతులకు 50శాతం రాయితీతో 90 రోజుల దాణాను పంపిణీ చేస్తామన్నారు. ఇందుకు పాడి రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

# హంద్రీనీవా అభివృద్ధి పనులకు మరోసారి ఆటంకం


హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జోరుగా సాగుతున్న హంద్రీనీవా పనులకు మరోసారి వర్షం ఆటంకం కలిగించింది. సుమారు 50 రోజులుగా హంద్రీనీవా కాలవ వెడల్పు, లైనింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత నెలలో ఓ దఫా వర్షం పడడంతో పనులు ఆగాయి. ఉరవకొండ నియోజకవర్గం ఎగువన ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు హంద్రీనీవా కాలవ గట్టు కోతకు గురి కావడం, వర్షపు నీరంతా కాలవలోకి చేరడంతో పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో హంద్రీనీవా అధికారులు, కాంట్రాక్టర్లు పనులను నిలిపివే శారు. అత్యాధునిక యంత్రాలు, టెక్నాలజీ, అధికమంది కూలీలతో పనులు చురుగ్గా సాగుతున్న నేపథ్యంలో మరోసారి వర్షం ఆటంకంగా మారింది. సోమవారం క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ నాగరాజు, హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్ మాట్లాడుతూ.. వర్షం ఎక్కువ రావడంతో కాలవలోకి నీరు చేరి కాలవ గట్టు కోతకు గురైందని, దీంతో పనులకు కొద్దిగా ఆటంకం కలిగిందని తెలిపారు. అయినా కాలవలోకి చేరిన వర్షం నీటిని భారీమోటార్లతో బయటకు తోడేస్తున్నామని... వర్షం రాకపోతే తిరిగి రెండు మూడు రోజుల్లో పనులను ప్రారంభించి...రెట్టింపు ఉత్సాహంతో సీఎం ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు.

## ఉద్యాన శాఖ డీడీగా ఉమాదేవి

అనంతపురం అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ డీడీగా ఉమాదేవి నియమితులయ్యారు. కర్నూలు జిల్లా ఏపీఎంఐపీ పీడీగా పని చేస్తున్న ఆమెను ఇక్కడి ఉద్యాన శాఖ డీడీగా బదిలీ చేశారు. ఏడాది క్రితం జిల్లా ఉద్యాన శాఖ డీడీగా నియమితులై ఒక్క రోజులో కమిషనరేట్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లిన అండాలును విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ధనుంజయను ఏపీఎంఐపీ ఏపీడీగా బదిలీ చేశారు. ఉద్యాన శాఖ ఏడీ నరసింహారావును నెల్లూరు ఏడీగా బదిలీ చేశారు.

## మెడికల్ కళాశాలలో యోగాసనాలు


యోగాసనాలతో అబ్బురపరుస్తున్న యశ్వంతి

అనంతపురం టౌన్/ అనంతపురం క్లాక్‌టవర్: జూన్9(ఆంధ్ర జ్యోతి): యోగాంధ్ర కాంపెయిన్‌లో భాగంగా సోమవారం నగరంలోని ప్రభుత్వ మెడికల్‌కళాశాల ఆవరణలో యోగాపై అవగాహన కొనసాగించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు, వైద్యులు, వైద్యఉద్యోగులు, మెడికోలు పెద్దఎత్తున పాల్గొని యోగాసనాలు వేశారు. హౌస్‌సర్జన్ యశ్వంతి రాయల్ ప్రదర్శించిన యోగాసనాలు అబ్బురపరిచాయి. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ ఆర్ఎంఓ హేమలత, సీనియర్ వైద్యులు ఆత్మారామ్,సుబ్రమణ్యం,మనోరంజన్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, పరదేశీనాయుడు, ఆయుష్‌డాక్టర్ బాల్యానాయక్, వివేకానందయోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాబలేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు


మహాబలేశ్వరుడిపై సూర్యకిరణాల దర్శనం

అనంతపురం కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ కాలనీలోని కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయంలోని మహాబలేశ్వరుడి లింగాన్ని సోమవారం సూర్యకిరణాలు తాకాయి. పవిత్ర సోమవారం రోజున స్వామి వారిని సూర్యకిరణాలు తాకిన విషయం తెలుసుకుని స్థానికులు విరివిగా వచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దేవనూరు సుందరం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## 28 మందిపై కేసు నమోదు

గార్లదిన్నె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుంపల్లి గ్రామంలో ఇరువర్గాలకు జరిగిన ఘర్షణలో 28 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. కనుంపల్లిలో టీడీపీకి చెందిన ప్రసాద్, నల్లమ్మ వర్గీయులు పాత కక్షల నేపథ్యంలో గత ఆదివారం సాయంత్రం పరస్పరం ఘర్షణకు పాల్పడి కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారన్నారు. ఘటనలో ఇరు వర్గాలకు చెందిన ఏడుగురు గాయపడ్డారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 28 మంది పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## చెత్తసేకరణకు రూట్‌మ్యాప్ సిద్ధం

అనంతపురం క్రైం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని చెత్త సేకరణకు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు నగరపాలక కమిషనర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గూగుల్ మ్యాప్‌ద్వారా క్రమ పద్ధతిలో సేవలందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. సంబంధిత ర్యూట్‌మ్యాప్‌ను సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. ఆయా పరిధిలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు గమనించాలని కోరారు.

## రక్తదాతలకు సత్కారం

అనంతపురం కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు రక్తదాతలు, స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులకు సత్కారం చేశారు. నగరంలోని ఆదరణ సేవాసమాజ్ కార్యాలయంలో సోమవారం ఫ్రెండ్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు, సహృదయ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో మానవత కన్వీనర్ తరిమెల అమర్నాథరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాతలకు, స్వచ్ఛందసేవా సంస్థల నిర్వాహకులకు ప్రశంసాపత్రాలు, ప్రాణదాత సేవా పురస్కారాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మానవత కోకన్వీనర్ సలీం మాలిక్, రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకుడు టంగుటూరి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తన వేరుశన పంపిణీ

అనంతపురంరూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లి, కామారుపల్లి గ్రామాల్లో సోమవారం టీడీపీ నాయకులు, వ్యవసాయ సిబ్బంది రైతులకు సబ్సిడీపై విత్తన వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రాగే మురళీ, సర్పంచు గురుప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

● రాప్తాడు: మండలంలోని అన్నిగ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. రాప్తాడులో ఏఓ శ్రీవాణి , టీడీపీ నాయకులు వేరుశనగ కాయలను పరిశీలించారు.

## భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి


అనంతపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలో విలువైన భూములను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడానికి పాల్పడుతున్న ఆక్రమణదారులపై, వారికి సహకరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు ఆయన ఇటీవల అనంతపురంరూరల్ కక్కలపల్లిగ్రామపొలంలో భూ కబ్జాదారులు చేసిన దాడిలో గాయపడిన శ్రీనివాసగుప్తా, పీవీప్రసాద్‌తో కలిసి వచ్చారు. అక్కడ జేసీ శివనారాయణశర్మను కలిసి మాట్లాడారు. ఎన్నోఏళ్లు హక్కుగా ఉన్న భూమిని ఆక్రమించడానికి కొందరు తీవ్రంగా ప్రయత్నించడం, చివరకు దాడులు చేయడం జరుగుతోందని, అందుకు రెవెన్యూ అధికారులు సహకారం అందించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

**● 583 వినతులు**

కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌కు పెద్దఎత్తున వినతులు వచ్చాయి. జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు ప్రజలు అందించించిన వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తంమీద 583మంది వచ్చి వినతులు అందజేసి న్యాయం చేయాలని విన్నవించుకున్నారు.

## విజన్-2047తో మారనున్న భవిష్యత్తు

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన విజన్- 2047 యాక్షన్ ప్లాన్‌తో రాష్ట్ర భవిష్యత్ మారనుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. సోమవారం స్వర్ణాంధ్ర కార్యాలయాలను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. సీఎం సందేశాన్ని అధికారులతో కలిసి వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో దూరదృష్టితో ఆలోచిస్తున్నారని అన్నారు. రానున్న నాలుగేళ్లలో అభివృద్ధి ఎలా ఉంటుందో చూస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే దాదులూరులో ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించామని తెలిపారు. రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులు కమీషన్ల కోసం జాకీ పరిశ్రమను వెళ్లగొట్టారని తెలిపారు. జాకీ స్థానంలో గార్మెంట్స్ పరిశ్రమ తీసుకురావాల్సి ఉందన్నారు. పేరూరుకు నీరు వస్తే వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటూ పరిశ్రమలు వస్తాయన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

# జగన్ మీడియాపై చర్యలు తీసుకోవాలి



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు



రాయదుర్గంలో సీఐ జయనాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

### మహిళలను కించపరిచిన వారిని అరెస్ట్ చేయాలి

గుంతకల్లు టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వేశ్యల రాజధాని అమరావతి అంటూ వ్యాఖ్యానించిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావుపై, దీన్ని ప్రసారం చేసిన జగన్ చానల్, ప్రచురించిన జగన్ పత్రికపై చర్యలు తీసుకోవాలని టీడీపీ, బీజేపీ, జనసేన మహిళలు డిమాండ్ చేశారు. స్థానిక అజంతా సర్కిల్‌లో సోమవారం సాయంత్రం కూటమి మహిళలు జగన్ పత్రికలను దహనం చేశారు. ఇందులో టీడీపీ తెలుగు మహిళలు తలారిసరోజమ్మ, ఉమాదేవి, అంజలి, నాగరత్న, ఇందిరమ్మ, చిట్టమ్మ, బీజేపీ నాయకురాలు వీ విజయలక్ష్మి, శ్రీదేవి, పద్మా, లావణ్య, జనసేన నాయకురాలు బండి చంద్రకళ, ఈరమ్మ పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : రాష్ట్ర రాజధాని మహిళలను కించపరిచిన జర్నలిస్టులు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే వారిని అరెస్ట్ చేయాలని తెలుగుదేశం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సంపత్‌కుమారి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బండి భారతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింకా వసుంధరదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ జయనాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఇందులో నాయకురాలు కౌన్సిలర్ ప్రశాంతి, సుమ, 50 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

● తాడిపత్రి: అమరావతి మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు, జగన్ మీడియా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్‌నాయుడు ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరికి సోమవారం ఫిర్యాదు చేశారు.

## న్యూస్ బాక్స్

### దరఖాస్తుల ఆహ్వానం

యల్లనూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలమకూరు ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల చిలమకూరులో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహేష్ తెలిపారు. 6 నుంచి 9 తరగతుల వరకు, ఇంటర్ మొదటి సంవత్సరానికి 10వ తేది నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఫలితాలు 25న వెల్లడిస్తామని తెలిపారు. 9వ తరగతి, ఇంటర్‌మీడియట్ బాలికలకు హాస్టల్ వసతి ఉందని తెలిపారు.

### సబ్సిడీ విత్తనాల పంపిణీ



శెట్టూరులో విత్తన కాయలను అందజేస్తున్న సిబ్బంది

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుసేవాకేంద్రంలో ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తన వేరుశనగ పంపిణీని ఏఓ మహబూబ్‌బాషా సోమవారం ప్రారంభించారు. ఇందులో ఎంపీఈఓలు నాగలక్ష్మి, రేష్మ పాల్గొన్నారు.

● కణేకల్లు : స్థానిక నాల్గవ రైతుసేవా కేంద్రం వద్ద రైతులకు విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఏఓ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఇందులో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఆనంద్, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ చాంద్ బాషా, చంద్రశేఖర్‌గుప్తా, ఈరప్ప, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● శెట్టూరు : మండల కేంద్రంలో ఏఓ వాసుకిరాణి టీడీపీ నాయకులతో కలిసి విత్తన వేరుశనగ కాయల పంపిణీని ప్రారంభించారు. ఇందులో ఏఈఓ ఆంజనేయులు, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గురుప్రసాద్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

### విచారణకు హాజరుకండి

పుట్లూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని విభిన్న ప్రతిభావంతులు ఈనెల 13న బుక్కరాయసముద్రంలో నిర్వహించనున్న సర్టిఫికెట్ల విచారణకు హాజరుకావాలని ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు తప్పకుండా సంబంధిత కార్యదర్శులను అడిగి వెళ్లాలని సూచించారు.

● రాయదుర్గంరూరల్: మండలంలో 207 మంది దివ్యాంగులకు వెరిఫికేషన్‌కు నోటీసులు పంపామని, వారు ఈ నెల 13, 18, జూలై 4న అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హాజరు కావాలని ఎంపీడీఓ కొండన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఆయా తేదీల్లో ఉదయం పది గంటలకంతా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి హాజరు కావాలన్నారు.

### కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి




పుట్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకుల నిరసన

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: భూమి లేని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సహాయం అందించాలని సీపీఐ నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంతకల్లు, గుత్తి, పుట్లూరు, యాడికి, డీ.హీరేహాళ్, పెద్దవడుగూరులో ఆ పార్టీ నాయకులు ఆయా తహసీల్దారు కార్యాలయాల వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన అన్ని రకాల పంట విత్తనాలు అందించాలని, రూ.5లక్షల వరకు పంట రుణాలను అందించాలని డిమాండ్ చేశారు. గుంతకల్లులో ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు, గుత్తిలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, పుట్లూరులో కౌలు రైతు సంఘం నాయకుడు రామాంజనేయులు, యాడికిలో ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడుయాదవ్, డీ.హీరేహాళ్‌లో సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, పెద్దవడుగూరులో సీపీఐ సీనియర్ నాయకుడు నారాయణ ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు చేపట్టారు.

### డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనారాయణ



రాయదుర్గం రూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కే లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో సీనియర్ అధ్యాపకుడు లక్ష్మీనారాయణ ప్రిన్సిపాల్‌గా నియమించారు.

### ఘనంగా సహకార సంఘం వేడుకలు

బొమ్మనహాళ్, జూన్ 9(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీఈఓ హనుమంతు ఆధ్వర్యంలో అంతర్జాతీయ వ్యవసాయ సహకార సంఘం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఇందులో సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, డీలర్ సంఘం అధ్యక్షుడు పయ్యావుల మోహన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఆపద్బాంధవ ట్రస్ట్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న మురళి

ఉరవకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆపద్బాంధవ ట్రస్ట్‌కు ప్రాణదాత సేవా పురస్కారం లభించింది. ఈ అవార్డును ఆ ట్రస్ట్ ఫౌండర్ వేల్పుల మురళికి అనంతపురంలో మనవతా సంస్థ వ్యవస్థాపకుడు అమర్‌నాథ్ సోమవారం అందజేశారు.

### ఉత్సాహంగా యోగాంధ్ర

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : యోగాంధ్రలో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో సోమవారం ఉత్సాహంగా అవగాహన ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. యాడికిలో నిర్వహించిన కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, ఉరవకొండలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎల్‌డీఓ విజయ్‌లక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను తాడిపత్రి, గుత్తి, కూడేరు, పుట్లూరు, పెద్దవడుగూరు, బొమ్మనహాళ్, విడపనకల్లు, బెళుగుప్ప, కుందుర్పి, శెట్టూరు, పెద్దపప్పూరు తదితర ప్రాంతాల్లోనూ నిర్వహించారు.

### రేపు మెగా జాబ్‌మేళా

యల్లనూరు/పుట్లూరు, జూన్9(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 11న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 8500472180, 8317520929 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## వైసీపీ నీటి స్కాం రూ. కోటి

### మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



తాడిపత్రి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు వాటర్ ప్లాంట్ల విషయంలో దాదాపు రూ. కోటి అవినీతికి పాల్పడ్డారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక నివాసంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో వాటర్‌ప్లాంట్లు అడ్డదిడ్డంగా నిర్మించి పరిశ్రమల నుంచి దాదాపు రూ.20 లక్షలు, మున్సిపాలిటీ నుంచి దాదాపు రూ.20 లక్షలు ఖర్చు చేశారన్నారు. కేవలం మూడు నెలలు మాత్రమే మున్సిపాలిటీ వారికి కరెంట్ బిల్లులు చెల్లించారని.. మిగతా కాలం బిల్లులు చెల్లించలేదన్నారు. కొన్ని ప్లాంట్లలో సామన్లు కూడా ఎత్తుకెళ్లారని, వారిపైన ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. వీటి ద్వారా వారు సుమారు రూ.కోటి అవినీతికి పాల్పడ్డారన్నారు. వృథాగా ఉన్న 13 వాటర్ ప్లాంట్లకు దాదాపు రూ.10 లక్షలు ఖర్చుపెట్టి.. వాటిని స్వచ్ఛంద సంస్థకు అప్పజెప్పామన్నారు. వీటి ద్వారా క్యాన్ నీటిని రూ.5లకే అందిస్తామన్నారు. కాగా పట్టణంలో చాలా వాటర్‌ప్లాంట్లకు ఐఎస్ఓ మార్క్ లేదని, జూలైలోపు ఐఎస్ఓ మార్క్‌తో పాటు అన్నిరకాల అనుమతులు తెచ్చుకోవాలని, లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

### బాధ్యతల స్వీకరణ



వై.పద్మావతి

కంబదూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా వై. పద్మావతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. దాదాపు ఏడాదిన్నర పాటు ఈ పోస్ట్ ఇక్కడ ఖాళీగా ఉంది.



నాగమణి

● కణేకల్లు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా నాగమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఉన్న సీడీపీఓ యల్లమ్మ బదిలీ కాగా దాదాపు 10 నెలలపాటు కళ్యాణదుర్గం సీడీపీఓ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో గుత్తి సీడీపీఓగా ఉన్న నాగమణి ఇక్కడికి బదిలీ అయ్యారు.

### చెస్‌లో విద్యార్థుల ప్రతిభ

గుంతకల్లు టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం గదగ్‌లో ఈ నెల 8న నిర్వహించిన చిల్డ్రన్స్ అండర్-18 ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో గుంతకల్లు విద్యార్థులు ప్రతిభ చాటారు. పునీత్‌రెడ్డి, స్నేహిత్, జునైరా, హర్ష ప్రతిభ చాటి ట్రోఫీలతో పాటు, రూ. 10 వేలు నగదు బహుమతి గెలుచుకున్నారని చెస్ కోచ్‌లు అనిల్‌కుమార్, రామారావు సోమవారం తెలిపారు.



ట్రోఫీలు చూపుతున్న విద్యార్థులు

### హరీష్‌రెడ్డికి పరామర్శ

తాడిపత్రి, జూన్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ సర్పంచు హరీష్‌రెడ్డి ఇటీవల ముక్కుకు ఆపరేషన్ చేయించుకున్నారు. దీంతో ఆయన్ను ఆయన స్వగృహంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ పరామర్శించారు.



డైనింగ్ హాల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

### అభివృద్ధి పనులకు భూమిపూజ

గుంతకల్లు నెట్‌వర్క్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోమవారం భూమి పూజ చేశారు. వాల్మీకినగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో రూ.10 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో డైనింగ్ హాల్ నిర్మాణానికి, అదే కాలనీలో రూ.27 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, కమిషనర్ నయ్యాం అహ్మద్, తహసీల్దారు రమాదేవి, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, తలారి జరోజమ్మ, వాసగిరి మణికంఠ పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ: నియోజకవర్గంలోని 17మంది బాధితులకు రూ. 10.17 లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం వారికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుత్తి మండలం యంగన్నపల్లికి చెందిన వైసీపీ నాయకుడు పీ పరమేశ్‌కు సీఎంఆర్ఎఫ్ కింద రూ. 1,91,242 ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని, పార్టీలకు అతీతంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని అన్నారు.

### గొర్రెల పెంపకంతో లాభాలు

బెళుగుప్ప, జూన్ 9(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ.. గొర్రెల పెంపకం చేపడితే అధిక లాభాలు పొందవచ్చని పశు వైద్యాధికారి రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని నరసాపురంలో సోమవారం వీరు బ్యాక్ కంపెనీ ఆర్థిక సహకారంతో గొర్రెల పెంపకందారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నట్టల నివారణ మందులు, ఎదుగుదలకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఇందులో ఆ కంపెనీ ప్రతినిధి తిరుపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారం



ఉదిరిపికొండలో బోరు వేయిస్తున్న అధికారులు

కూడేరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలం ఉదిరిపికొండ గ్రామంలో గ్రామస్థులు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను మండల టీడీపీ నాయకులు పయ్యావుల సోదరుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం ఉదయం ఆ గ్రామ సమీపంలో ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగదివ్య, ఈఓఆర్డీ రాధాకృష్ణ, స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బోరు వేశారు. నీరు పుష్కలంగా పడటంతో ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## క్రైం న్యూస్..

### రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఉరవకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుంతకల్లుకు చెందిన వన్నూరుస్వామి తన భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలతో కలిసి బైక్‌పై విడపనకల్లు నుంచి ఉరవకొండకు సోమవారం బయలుదేరాడు. పట్టణ శివారులోని డ్రైవర్స్ కాలనీ సమీపంలో ఆ బైక్ అదుపు తప్పి కింద పడటంతో ఆ నలుగురూ గాయపడ్డారు. వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### ఘర్షణలో నలుగురికి..

గుత్తిరూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడ్డారు. ఆ గ్రామానికి చెందిన మల్లయ్య, రాము, ప్రభాకర్, రామకృష్ణ మరో వర్గానికి చెందిన లింగమయ్య, రంగస్వామి, శివ, రామదేవి ఇంటి దగ్గర చిన్న విషయంలో ఘర్షణ పడ్డారు. మాటా.. మాటా పెరిగి కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో రాము, ప్రభాకర్, రంగస్వామి, రామదేవి గాయపడ్డారు. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### ఎలక్ట్రీషియన్‌కు గాయాలు



గాయపడ్డ కృష్ణబాబు

ఉరవకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాములమ్మ గుడి వద్ద విద్యుత్ లైన్‌లకు మరమ్మతులు చేస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ కృష్ణబాబు సోమవారం విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనికి రాజశేఖర్ అనే యువకుడు సీపీఆర్ చేసి.. ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

### ఇరువర్గాల ఘర్షణ

తాడిపత్రి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు బయన్న, రంగనాయకులు, టీడీపీ వర్గీయులు రవి, పెద్దన్న పాతకక్షల కారణంగా ఆదివారం రాత్రి ఘర్షణపడ్డారు. సజ్జలదిన్నె నుంచి బయన్న, రంగనాయకులు బైక్‌లో వెళుతుండగా ఆలూరు నుంచి రవి, పెద్దన్న సజ్జలదిన్నె వైపునకు వచ్చారు. ఆలూరు-సజ్జలదిన్నె మధ్యలో ఇరువురు ఎదురుపడ్డారు. ఘర్షణకు దిగారు. అటుగా వెళ్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

### స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విప్ కాలవ

రాయదుర్గంరూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వర్ణాంధ్రవిజన్ నియోజకవర్గ కార్యాలయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. స్వర్ణాంధ్ర ఆంధ్రప్రదేశ్ విజన్ ప్లాన్ 2047 రాష్ట్ర అభివృద్ధిపై సీఎం చంద్రబాబునాయుడు విజన్ ప్లాన్ విడుదలలో భాగంగా విప్ దీన్ని ప్రారంభించారు. సీఎం చంద్రబాబు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల డివిజన్ సాధికారాలతో 25 సంవత్సరాల్లో చేపట్టబోయే అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీడీ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ కొండన్న, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గొడిశలపల్లి హనుమంతరెడ్డి హాజరయ్యారు.

### వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్

తాడిపత్రి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌బజారు, పోరాట కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైస్ చైర్‌పర్సన్ అరుణ వాటర్‌ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, ఎస్వీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, మోటాటి పవన్‌కుమార్‌రెడ్డి, షెక్షావలి, అబ్దుల్‌రహీం, విజ్జి, మల్లికార్జున, తిరుపాల్‌రెడ్డి, రంగనాథరెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

### మలేరియాపై అవగాహన ర్యాలీ

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం యాడికిలో మలేరియా నివారణపై ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు సాయిసుశాంత్‌రెడ్డి, మలేరియా నివారణ తాడిపత్రి సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఆరోగ్యసిబ్బంది జుబేదా, రాంప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.



## సమయపాలన లేని సచివాలయాలు

**తీరు మారని సిబ్బంది**

**విధుల పట్ల అదే నిర్లక్ష్యం**

ఆంధ్రజ్యోతి విజిట్

గుంతకల్లు నెట్‌వర్క్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి .. వారి సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారులు పలుమార్లు సూచించినా.. హెచ్చరించినా.. సచివాలయ సిబ్బందిలో ఏ మార్పూ రాలేదు. వారు ఎప్పటిలాగే విధులను నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. ఫీల్డ్ వర్క్... సర్వేలు.. మీటింగ్‌లు అంటూ సచివాలయాలకు డుమ్మా కొడుతున్నారు. పట్టణాల్లోని సచివాలయాల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నా.. పంచాయతీల్లోని సచివాలయాల్లో మాత్రం సిబ్బంది ఇష్టారాజ్యం నడుస్తోంది. రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, కుల, ఆదాయం, వేరుశనగ విత్తనాల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు సచివాలయానికి వస్తే సిబ్బంది సరిగా ఉండటంలేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఆంధ్రజ్యోతి రెండు రోజుల పాటు ఆ కార్యాలయాలను విజిట్ చేసింది.

● గుంతకల్లు మండలంలోని దోనిముక్కలలో పదిన్నర గంటలైనా సచివాలయాన్ని తెరవడం లేదు. ఈ సచివాలయ పరిధిలోకి దోనిముక్కల, జీ కొట్టాల, పులగుట్టపల్లి చిన్నతండా, పెద్ద తండా గ్రామాలు వస్తాయి. సుమారు 11 గంటలకు రైతు కేంద్రం సిబ్బంది వచ్చి సచివాలయం, రైతు కేంద్రం తాళాలు తెరుస్తున్నారు. జీ కొట్టాల, దోనిముక్కల, పులగుట్టపల్లి పంచాయతీలకు కేవలం వెల్ఫేర్ సెక్రెటరీ, ఇన్చార్జి డీజిటల్ సెక్రెటరీ మాత్రమే విధులకు హాజరయ్యారు. మహిళా పోలీసు, వీఆర్వో, సర్వేయర్, ఏఎన్ఎం, జేఎల్ఎం, హర్టీ, అగ్రికల్చర్, ఇంజనీర్ సెక్రెటరీలు కనిపించలేదు. పంచాయతీ కార్యదర్శి పని ఉంటే సచివాలయానికి వస్తుంది.. లేదంటే ఎంపీడీఓ కార్యాలయంలోనే ఉంటుందట. సర్వేయర్ రీసర్వే పని మీద వెళ్లినట్లు తెల్సింది.

● గుత్తి మండలంలో..: తొండపాడు సచివాలయంలో పదిన్నర గంటల లోపు కార్యదర్శులు హాజరు వేసి.. తరువాత వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం డిజిటల్, ఇంజనీర్ అసిస్టెంట్, మహిళ పోలీసు, అగ్రికల్చ్ అసిసెంట్ మినహా ఏ కార్యదర్శీ సచివాలయానికి రాలేదు. సర్వే అని, మండలాఫీసులో పని అంటూ సచివాలయానికి సిబ్బంది సరిగా రావడంలేదని స్థానికులు తెలిపారు.

● ఉరవకొండ మండలంలో..: నింబగల్లు సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు. ఎప్పుడు వెళ్లినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తాయి. ఉదయం 11 గంటలైనా 8మంది సిబ్బందికి గానూ ముగ్గురు మాత్రమే సక్రమంగా వస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ సచివాలయానికి వెళ్లకుండా ఎంపీడీఓ కార్యాలయానికే పరిమితమవుతున్నారు. అలాగే పట్టణంలోని 5వ సచివాలయంలో 8 మంది సిబ్బందికి గానూ ముగ్గురు మాత్రమే హాజరవుతున్నారు.

● విడపనకల్లు మండలంలో..: మాళాపురం పంచాయతీ సచివాలయంలో 10 మంది సిబ్బంది ఉన్నారు. శుక్రవారం వారిలో ముగ్గురు మాత్రమే విధులకు హాజరయ్యారు. వారిలోనూ పంచాయతీ కార్యదర్శి వేతనాలు బిల్లులు చేయాలని, డిజిటల్ అసిస్టెంట్ యోగాంధ్రా సర్వేలకు వెళ్లడంతో ఇక ఒక్కరు మాత్రమే సచివాలయంలో ఉన్నారు. మిగిలిన వారు సర్వేలు.. మీటింగ్‌లు.. అంటూ సచివాలయానికి రావడం లేదని తెల్సింది.







దోనిముక్కల, తొండపాడు, నింబగల్లు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న కుర్చీలు

### ప్రజా సమస్యలపై అదే నిర్లక్ష్యం



డీటీ మాత్రమే హాజరైన దృశ్యం

యల్లనూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పట్ల అధికారులు అదే నిర్లక్ష్యం చూపుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా కొట్టారు. తహసీల్దార్ లేకపోవడంతో ఈ సమావేశానికి డిప్యూటి తహసీల్దార్ మునీంద్ర హాజరుకాగా.. మిగిలిన అధికారులు గైర్హాజర్ అయ్యారు. మొత్తం 17 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా.. కేవలం ముగ్గురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. వీరిలో ఇద్దరు సంతకాలు చేసి వెళ్లిపోవడంతో డిప్యూటి తహశీల్దార్ ఒక్కరే ఉండిపోయారు.